# సైకో కలకలం

## దాడిలో భిక్షగాడి మృతి.. మరో ఇద్దరికి గాయాలు

- తిరుపతిలో పెరిగిపోతున్న మతిస్థిమితం లేని వ్యక్తులు
- స్థానికులు, భక్తుల్లో ఆందోళన

వాళ్లలో వాళ్లే మాట్లాడుకుంటూ ఉంటారు. జనం గుమికూడిన చోటికి వచ్చి బూతులతో తిడుతుంటారు. కుక్క లేదా ఏదైనా జంతువు కనిపిస్తే రోడ్డుపైకి రాళ్లు విసురుతారు. ఆ రాయి ఎక్కడ తగులుతుందోనని జనం, వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంటుంది. పిచ్చోళ్లలా ఉంటూ చేతిలో పెద్ద కర్రతో తిరిగే వారిని చూసి భయపడుతుంటారు. ఇలాంటి వారు తిరుపతి నగరంలో ఎక్కువవుతున్నారు. సోమవారం నాటి ఘటనతో ఆధ్యాత్మిక క్షేత్రంలో కలకలం రేగింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి






మృతిచెందిన భిక్షగాడు - గాయపడిన కల్పన, సుబ్రహ్మణ్యం - నిందితుడి వద్ద దొరికిన కత్తులు



సైకోను తీసుకెళుతున్న పోలీసులు

కుటుంబంలో అనాదరణకు గురైన వారు. పక్కరాష్ట్రాలు, జిల్లాల్లోని కొందరు యాచకులు. మతిస్థిమితం లేని వారు. వీరందరికీ ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి కేరాఫ్‌గా మారుతోంది. ఇలా వచ్చిన వారిలో కొందరి విపరీత పోకడలు స్థానికులు, భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. మాసిన ముఖం...పెరిగిన గడ్డం...చిరిగిన దుస్తులు ధరించి వీరు ఇటీవల తుడా సర్కిల్, లీలామహల్ రోడ్డు, మంగళం రోడ్డు, తిలక్ రోడ్డు, నంది సర్కిల్, అన్నారావు సర్కిల్, కపిలతీర్థం, గోవిందరాజ స్వామి ఆలయం, బస్టాండు, రైల్వే స్టేషన్ రోడ్డు, బాలాజీ కాలనీ, అలిపిరి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సంచరిస్తున్నారు. ఎవరైనా వీరిలో కొందరి జోలికి వెళ్ళినా, వారిని పలకరించినా వెంటనే కర్రలు, కత్తులతో దాడులకు దిగుతున్నారు. కొన్ని సర్కిళ్లలో వాహనదారులకు అడ్డండపడి భిక్షాటన చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తున్నారు. ఇక, ఓ మహిళ భిక్షాటన సమయంలో ఎవరైనా డబ్బులు ఇవ్వకుంటే వారిని నానా బూతులతో తిడుతుంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు తిరుపతిలో 60 నుంచి 70 మంది వరకు భిక్షగాళ్ళు, మతిస్థిమితం కోల్పోయిన వారు ఉన్నట్లు సమాచారం. ఈ మతిస్థిమితం కోల్పోయిన వారే ప్రవర్తనే కొన్ని సమయాల్లో సైకోల్లా ఉంటుంది. ఇలాంటి వారి ప్రవర్తనపై నిఘా ఉంచి.. వీరిని మానసిక వికలాంగుల ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించాల్సిన పోలీసులు, మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఇవీ ఘటనలు

- 15 రోజుల క్రితం తుడా సర్కిల్ వద్ద ఉదయం సమయంలో దినసరి కూలీగా పనిచేస్తున్న రామస్వామిపై ఓ యాచకుడు దాడి చేశాడు. ఈ ఘటనలో అతను స్వల్పంగా గాయపడ్డారు.
- లీలామహల్ సర్కిల్ వద్ద ఫుట్‌పాత్‌పై భోజనం చేస్తున్న ఇద్దరు మహిళల వద్దకు వెళ్లిన ఒక మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి అన్నం పెట్టాలని అడిగాడు. వారు లేదని చెప్పడంతో తన చేతిలో ఉన్న కర్రతో కొట్టాడు. దీంతో ఒక మహిళ గాయపడింది.
- మూడు నెలల క్రితం లీలామహల్ నుంచి శివజ్యోతినగర్ వైపు నడచి వెళుతున్న ఒక యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ సమయంలో ఇద్దరు యువకులు అడ్డం పడ్డారు.

### వలేసి సైకోను పట్టుకుని..



సమాచారం తెలిసిన వెంటనే అలిపిరి పోలీసులు అప్రమత్తమయ్యారు. భిక్షగాడిని హతమార్చిన సైకోను పట్టుకోవడానికి నానా తంటాలు పడ్డారు. మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి సమక్షంలో సిబ్బంది, అలిపిరి ఎస్‌ఐ లోకేష్ బాబు, స్థానికులతో కలిసి వలవేసి పట్టుకున్నారు. అలిపిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతడి బ్యాగులో కత్తులు, కర్రలను సీజ్ చేశారు. నిందితుడిపై లునటిక్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం మంగళవారం రుయాకు తీసుకెళ్ళి కోర్టు ఎదుట హాజరుపరచి న్యాయమూర్తి ఆదేశాలతో వైజాగ్‌లోని పిచ్చాసుపత్రికి తరలిస్తామని అలిపిరి సీఐ రాంకిషోర్ ఆంధ్రజ్యోతికి చెప్పారు.

### తాజా ఘటనతో కలవరం

చాలామందిలాగే తమిళనాడు నుంచి తిరుపతికి చేరిన ఓ మతి స్థిమితంలేని వ్యక్తి.. సోమవారం ఉదయం 7.15 గంటల ప్రాంతంలో నంది సర్కిల్ వద్ద వీరంగం చేశాడు. భిక్షగాడు శేఖర్‌తో గొడవకు దిగి తన చేతిలో ఉన్న కర్ర, కత్తితో తలపై మోదాడు. అడ్డొచ్చిన భిక్షగత్తె కల్పనను.. పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న తారకరామానగర్‌కు చెందిన సుబ్రమ్మణ్యంపైనా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శేఖర్ మృతిచెందగా, మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన స్థానికులు, భక్తులను కలవరపాటుకు గురిచేసింది.

## ప్రతి అర్జీకీ సమాధానమివ్వండి



పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ ఆయన కలెక్టర్‌తో కలిసి వినతులు స్వీకరించారు. వేదిక కింద ఉన్న దివ్యాంగుల వద్దకు వెళ్లి నేలపై కూర్చుని వారి సమస్యలు తెలుసుకున్నారు.

- 8లో

## అభివృద్ధిలో జిల్లాను మొదట నిలుపుదాం

- ఐదు రంగాల్లో వనరులు, అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- బంగారు కుటుంబాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలి
- ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇంఛార్జి మంత్రి పిలుపు

- 8లో




ప్రభుత్వాస్పత్రి అత్యవసర విభాగం వద్ద కర్రలు, రాళ్లతో దాడి చేస్తున్న యువకులు - అత్యవసర విభాగం వద్ద ధ్వంసమైన రెండు ద్విచక్ర వాహనాలు

# రణరంగం

## ధర్మరాజస్వామి ఉత్సవాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- అనంతరం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో భీకర దాడులు
- పరుగులు తీసిన రోగులు

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య దాడులు.. వీధి పోరాటాన్ని తలపించింది. సిబ్బంది ప్రాణరక్షణ కోసం గదిలోకి వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది. రోగులు, వారి సంబంధీకులు ఏం జరుగుతుందో అర్థం కాక పరుగులు తీశారు. ఈ రణరంగం ఎందుకు జరిగిందంటే.. ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అగ్నిగుండం తర్వాత జరిగిన కురుక్షేత్ర సంగ్రామం (యుద్ధపర్వం) ఘట్టం జరుగుతోంది. ఆ ఉత్సవ సమయంలో ఆలయం వెనుక.. తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట పట్టణానికి చెందిన రోహిత్, ధనుష్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. అదే సమయంలో భాను, కిరణ్, చరణ్ ధర్మరాజస్వామి ఆలయం వైపు వెళుతుండగా వారితో వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. రోహిత్, ధనుష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి కుటుంబసభ్యులైన మునిరత్నం, సుధాకర్, మునిరాజా గాయపడిన రోహిత్, ధనుష్‌ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాసేపటికి భాను తన ఇద్దరు సోదరులతో పాటు మరి కొంత మందిని వెంటబెట్టుకుని ఆస్పత్రికి వెళ్లారు. ఇరువర్గాలు కత్తులు, దుడ్డుకర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు విరుచకపడ్డారు. కొందరు ప్రాణభయంతో తప్పించుకునే క్రమంలో కాన్పుల రూంలోకి చొరబడ్డారు. అక్కడ బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులు ఉన్నారు. ఆస్పత్రిలో రోగులంతా వణికిపోయారు. అక్కడే సమీపంలోనే నర్సింగ్‌స్టేషన్‌లో ఉన్న స్టాఫ్‌నర్సులు ప్రాణభయంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు కొందరు సెలైన్ స్టాండ్లతోనూ దాడికి దిగారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారంతో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, తన సిబ్బందితో ఆస్పత్రికి చేరుకున్నారు. ఇరువర్గాలు గాయాలతో రక్తస్రావం జరుగుతున్నా పోరు తగ్గలేదు. డీఎస్పీ చొరవతో అల్లరి మూకలను అదుపు చేశారు. ఇదే వైద్యశాలలో చికిత్సలందిస్తే మళ్లీ దాడులకు దిగుతారని భావించి.. మునిరత్నం, సుధాకర్, మునిరాజాను





ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండేళ్ల కిందట కూడా ఈ రెండు ప్రాంతాల మధ్య ఆస్పత్రి వద్ద జరిగిన దాడుల నేపథ్యంలో వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

### ఆస్పత్రి యంత్రాంగం స్పందనేదీ?

అందుబాటులో ఉండాల్సిన ఆస్పత్రి సూపరింటెండెంట్ మణి, ఇన్‌ఛార్జి ఆర్ఎంవో మురళీకృష్ణ తిరుపతిలో నివాసం. నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టు ఖాళీ. ఆ తరువాత స్థానంలోని ముగ్గురు హెడ్‌నర్సులు ఉండేదీ తిరుపతిలోనే. అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంత పెద్ద ఘటన జరిగితే సోమవారం ఉదయం ఆస్పత్రికి వచ్చారు. సీసీ కెమెరాల్లోని గొడవ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి.. పోలీసుల వైఫల్యంగా చూపేలా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయించారన్న విమర్శలున్నాయి. ఇంత బీభత్సంపై నిరసన తెలపలేదు. కనీసం అవుట్ పోస్టు కావాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి కూడా చేయక పోవడం గమనార్హం.

# ఇప్పుడొచ్చి చేసేదేమిటి జగన్?

ముగుస్తున్న మామిడి సీజన్



- ఇప్పటికే 2.42 లక్షల టన్నుల కొనుగోళ్లు
- 15 రోజుల్లో మిగిలిన కాయల అమ్మకాలు

మామిడి సీజన్ రెండు వారాల్లో ముగియనుంది. కష్టకాలమంతా వదిలేసి, ఆఖరి రోజుల్లో మామిడి రైతు కన్నీళ్లు తుడవడానికంటూ వైసీపీ అధినేత జగన్.. చిత్తూరు జిల్లా పర్యటనకు వస్తుండడం పట్ల అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 9న ఆయన బంగారుపాళ్యంలోని ఒక మామిడికాయల మండీని సందర్శించనున్నారు. నిజానికి గుజ్జు పరిశ్రమలు మామిడి కాయలు కొనుగోలు చేయడానికి సుముఖంగా లేని రోజుల్లో రైతులు అల్లాడిపోయారు. చంద్రబాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రూపాయల సబ్సిడీ ప్రకటించాకే పరిశ్రమల్లో కొనుగోళ్లు మొదలయ్యాయి. దీంతో మామిడిలోడ్లతో ట్రాక్టర్లు బారులు తీరాయి. ఈ కాలమంతా ప్రకటనలకే పరిమితం అయిన మాజీ సీఎం జగన్‌రెడ్డి సీజన్ ముగిసే సమయానికి వచ్చి ఓదార్చడం వల్ల రైతులకు ఏమి ప్రయోజనం ఉంటుందనే చర్చ జరుగుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఫ్యాక్టరీల్లో, ర్యాంపుల్లో కలిపి ఇప్పటికే 2.42 లక్షల టన్నుల మామిడి కాయల్ని కొనుగోలు చేశారు. 1.48 లక్షల టన్నుల కాయలు ఇంకా పొలాల్లో ఉన్నాయని అంచనా. రెండు వారాల్లో మొత్తం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇక తిరుపతి, అన్నమయ్య జిల్లాలతో పోల్చుకుంటే చిత్తూరు జిల్లాలోనే మామిడి అధికం. చిత్తూరు జిల్లాలో ఈ మామిడి ప్రాసెసింగ్ ప్రక్రియ ఇంకా రెండు వారాలకు పైబడి ఉండేలా కాయలు మిగిలి ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే ప్రక్రియ పూర్తయింది. తిరుపతి జిల్లాలో నాలుగైదు రోజులు ఉండే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లాలో ఈసారి 5 లక్షల టన్నుల తోతాపురి దిగుబడి వచ్చినట్లు అంచనా. ఇందులో సీజన్ ప్రారంభంలోనే పచ్చళ్ల కోసం కొన్ని మామిడి కాయలు అమ్ముడైపోయాయి. అలాగే కలర్ తోతాపురిని మంచి ధరలకు బయట అమ్ముకున్నారు. పచ్చళ్లకు, కలర్ కాయలు కలిపి 40వేల టన్నులు అమ్ముడయ్యాయి. 1.76 లక్షల టన్నుల కాయల్ని ఆయా ఫ్యాక్టరీలు కొనుగోలు చేయగా.. కిలోకు రూ.5 నుంచి రూ.6 మధ్యలో ఫ్యాక్టరీలు రైతులకు ఇచ్చాయి.

**తోతాపురి అమ్మకాలు ఇలా...**

| జిల్లా | మొత్తం సేకరణ (టన్నుల్లో..) | ఫ్యాక్టరీల్లో (టన్నుల్లో..) | ర్యాంపులు (టన్నుల్లో..) |
|---|---|---|---|
| చిత్తూరు | 2.42 లక్షలు | 1.76 లక్షలు | 66 వేలు |
| తిరుపతి | 62 వేలు | 41వేలు | 21 వేలు |
| అన్నమయ్య | 16 వేలు | 15వేలు | వెయ్యి |

### బయటి ప్రాంతాల ర్యాంపులకు తరలింపు

జిల్లాలోని ర్యాంపులు రూ.2, రూ.3 మాత్రమే ఇస్తున్న సమయంలో రైతులు కృష్ణగిరి వంటి బయటి ప్రాంతాల్లోని ర్యాంపులకు కాయలు తరలించారు. ఇలా 66వేల టన్నుల కాయల్ని బయటి ప్రాంతాల ర్యాంపుల్లో అమ్ముకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

### 70వేల టన్నుల కాయల వేస్టేజ్

సుమారు 70వేల టన్నుల కాయలు తొందరపాటు/ఆలస్యంగా కోత వల్ల, కుళ్లిపోవడం వల్ల పాడైపోయాయి. ప్రతి సంవత్సరం వచ్చిన దిగుబడిలో 10 నుంచి 12 శాతం మధ్యలో ఇలాంటి వేస్టేజ్ ఉంటుంది. ఈసారి దిగుబడి అధికంగా ఉండడంతో వేస్టేజ్ కూడా ఎక్కువగా ఉంది. ఇక మిగిలిన 1.48 లక్షల టన్నుల కాయల్ని ప్రాసెసింగ్ చేస్తున్నారు. సుమారు రెండు వారాల్లో ప్రాసెసింగ్ ప్రక్రియ పూర్తవుతుందని తెలుస్తోంది.

## క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు క్రీడలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతులుప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో బాలాజి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదిలోపు https://apsportsschool.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాల్గవ తరగతికి బాలురు 20, బాలికలు 20 మొత్తం 40, 5వ తరగతికి బాలురకు 20, బాలికలకు 20 చొప్పున 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు పైనున్న వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



కుమ్మరపల్లెలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

భాకరాపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు పంచాయతీ టేగలగుంట, కుమ్మరపల్లె, తాటిమాకులపల్లె గ్రామాలలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటసుబ్బయ్య, ప్రకాశ్, బెల్లంకొండ రమణ, హైదర్‌వలీ, కృష్ణయ్య, రఫీ, అల్తాఫ్, మల్లికార్జున, రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ



పీర్ల చావిడిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భాకరాపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో పీర్ల పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాతిమానగర్ పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన పీర్లకు 10 రోజులుగా పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. చదివింపులు చేశారు. సోమవారం సాయంత్రం ముతవల్లి షాజహాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అగ్నిగుండం ఏర్పాటు చేశారు.

## ఘనంగా ధనుమకొండ గంగజాతర



గంగమ్మ తల్లికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువు పంచాయతీ మొరవపల్లె ధనుమకొండ గంగమ్మ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలు, మామిడి, వేపాకు తోరణాలు, అరటిబోదలతో అలంకరించారు. వివిధ పుష్పాలతో అమ్మవారిని మస్తాబు చేశారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

## తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



తిరుపతి(సెంట్రల్), జూలై7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో సోమవారం రైల్వే బోర్డు ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలేంద్రసింగ్ తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఆరు ప్లాట్‌ఫారాల్లో ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. విశ్రాంతి గదులు, టికెట్ కౌంటర్లు, పలు కార్యాలయాలను సందర్శించారు. ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ మధుసూదనరావు, ఏడీఆర్‌ఎం యు.సుధాకర్, డిప్యూటీ సీఈ వామనమూర్తి, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు డాక్టర్ కె.చిన్నపరెడ్డి, అధికారులు మణికంఠ, రమణరావు, ప్రభాకర్, మాధవరావు ఆయన వెంట ఉన్నారు.

## వాటర్‌ప్లాంటు సామగ్రి ధ్వంసం



దాడి ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పాకాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శివశక్తినగర్‌లో ఇంటివద్ద నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ పరికరాలను ధ్వంసం చేశారని సి.యోగిత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 6.30 గంటలకు ఇద్దరు ఇనుప రాడ్లు, రాళ్లతో దాడి చేశారని, కిటికీ అద్దాలు, వాటర్‌ప్లాంటు కొళాయిలు, పైపులు ధ్వంసం చేశారని అన్నారు. ఇంటిముందు పార్క్ చేసిన బైక్‌ను కిందపడేశారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

## టీడీపీ సీనియర్ నేత కృష్ణయ్యకు నివాళి

రామచంద్రాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): నెత్తకుప్పం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత కృష్ణయ్య మృతదేహానికి ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం నివాళులర్పించారు. కృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఉమాపతినాయుడు, హరిప్రసాద్, జేడీ జగన్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## పామాయిల్ సాగుపై మొగ్గు చూపండి



పామాయిల్ తోటలో పూతను తొలగిస్తున్న రైతు

రామచంద్రాపురం: జూలై 7(ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుపై రైతులు మొగ్గు చూపాలని త్రీఎఫ్ ఆయిల్‌ఫాం కంపెనీ ఉమ్మడి జిల్లా మేనేజరు వెంకటమురళి కోరారు. రావిళ్లవారిపల్లెలో సాగులో ఉన్న పామాయిల్ తోటలను ఆయన సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. పామాయిల్ తోటలకు ప్రభుత్వం పూర్తిగా సబ్సిడీ ఇస్తోందన్నారు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డెప్ప నాయుడు, దేవరాజులునాయుడు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం



గంగిరెడ్డిపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయంగా పనిచేస్తోందని తెలుగు యువత చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఢిల్లీనాథరెడ్డి అన్నారు. మండలంలోని గంగిరెడ్డిపల్లెలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిప్రసాద్, మునికృష్ణారెడ్డి, గోపి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



రెడ్డినాయక్ మృతదేహం

ఎర్రావారిపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎర్రావారిపాలెం ఎస్‌ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. మండలంలోని ఎల్లమంద రెడ్డినాయక్ తాండాకు చెందిన రైతు రెడ్డినాయక్ (70) తన గ్రామానికి చెందిన యువకుడు కిరణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఎల్లమందకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొంది. ఈ ఘటనలో రెడ్డినాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. కిరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## డాక్టర్ జయసుధ సేవలు అమోఘం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చిన్నబాబు

రామచంద్రాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): సొరకాయలపాళెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ జయసుధ సేవలు అమోఘమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చిన్నబాబు అన్నారు. సొరకాయలపాళెం ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీ అయిన జయసుధ, దామోదరం, రామాంజనేయులును సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హరిశంకర్ పాల్గొన్నారు.

## బండిబాట ఆక్రమణను తొలగించండి



వినతిని చూపిస్తున్న విజయకుమార్

రామచంద్రాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు వెళ్లే శవ్వాయికాలువ బండి బాట ఆక్రమణను తొలగించాలని గ్రామస్థులు పీజీఆర్‌ఎస్‌లో సోమవారం విన్నవించారు. రైతు విజయకుమార్ మాట్లాడుతూ కేకేవీపురం లెక్క దాఖల శవ్వాయి కాలువ బండి బాట 1953 నుంచి ఉందన్నారు. తమ పొలాలకు వెళ్లే దారిని విశ్రాంత రెవెన్యూ అధికారి ఇటీవల యంత్రాలతో తవ్వి అతని పొలంలో కలుపుకున్నాడన్నారు. 8మంది రైతులు ఈ దారి గుండానే పొలాలకు వెళ్లాల్సి ఉందన్నారు. కార్యాలయాల చుట్టు తిరిగినా అధికారులు స్పందించలేదన్నారు. దారి ఆక్రమణను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరినాథ్, విజయకుమార్, ఆర్.విజయ, విమల పాల్గొన్నారు.

## ఆనందగిరి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

- సమీక్షా సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే నాని ఆదేశం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్లవారిపల్లె సమీపం ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సోమవారం ఎమ్మెల్యే పులివర్తి నాని సమీక్షించారు. ఆగస్టులో జరగనున్న ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆడికృత్తిక రోజున స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలన్నారు. దర్శనం త్వరితగతిన అయ్యేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఊట్లవారిపల్లె నుంచి ఆలయం వరకు కట్టపై నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టరును ఆదేశించారు. ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను బ్రహ్మోత్సవాల లోపు పూర్తి చేయాలన్నారు.

## చౌక దుకాణాలపై విజి'లెన్స్'

- నెల రోజుల వ్యవధిలో మూడు షాపులు సీజ్
- అదనపు స్టాకు వుండడమే కారణం



తిరుపతిలో చౌక దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్సు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చౌక దుకాణాలపై విజిలెన్సు అధికారులు కొద్ది రోజులుగా దాడులు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం తిరుపతిలోని కనకభూషణ లే అవుట్‌లో దుకాణం నెంబరు 16ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్సు ఎస్‌ఐ వెంకటరమణ, సివిల్ సప్లయిస్ డీటీ గంగయ్య, సిబ్బందితో కలసి తనిఖీలు చేపట్టారు. ఈ షాపును బినామీ వ్యక్తి నిర్వహిస్తున్నట్లు విచారణలో బయట పడినట్లు తెలిసింది. దీంతో పాటు దుకాణంలో ఉండాల్సిన స్టాకు కంటే అదనంగా 430 కిలోల బియ్యం, 106 కిలోల చక్కెర వుండడంతో విజిలెన్సు అధికారులు సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో దుకాణాన్ని విజిలెన్సు అధికారులు వీఆర్వో సమక్షంలో సీజ్ చేశారు. వారం రోజుల క్రితం మంగళంలోని చౌక దుకాణంలో సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేసిన అధికారులు అక్కడ కూడా స్టాకు రిజిస్టర్ కంటే ఎక్కువగా బియ్యం వుండడంతో దుకాణాన్ని సీజ్ చేశారు. గత నెలలో దాదాపు 10 చౌక దుకాణాలను తనిఖీ చేసిన విజిలెన్సు అధికారులు చంద్రగిరి పరిధిలో ఒక దుకాణాన్ని సీజ్ చేశారు. ఎవరికైనా సరుకులు అందకుండా వుండి నిత్యావసర వస్తువులు పక్కదారి పడుతున్నట్లు తెలిస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ సూచించారు.

## అధునాతన సాంకేతికతపై అవగాహన



సాంకేతిక పరిజ్ఞాన పరికరాలపై అవగాహన కల్పిస్తున్న మధులాష్‌బాబు

చంద్రగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు అధునాతన సాంకేతికతపై ఫ్లో బస్సు ఫౌండర్ మధులాష్ బాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సోమవారం ఫ్లో బస్సు(ఫీచరిస్టు ల్యాబ్ ఆన్ వీల్స్)లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 16 పరికరాలతో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అందులో రోబోటిక్, డ్రోన్, త్రీడీ ప్రింటింగ్, అత్యవసర టెక్నాలజీస్ అంశాలు ఉన్నాయి. భవిష్యత్తులో ఉన్నత చదువులలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యా బోధన ఉంటుందన్నారు. కావున చిన్నప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లో బస్సు ప్రతినిధులు అజయ్‌రెడ్డి, దిండు సాయి, ఆధిత్య, వినీత్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేశ్‌కు సాదర వీడ్కోలు



రేణిగుంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు సాదర వీడ్కోలు పలికారు. నెల్లూరు జిల్లాలో జరి గిన కార్యక్రమాన్ని ముగించుకొని సోమ వారం రాత్రి తిరుపతి విమానాశ్రయం చేరు కున్న ఆయనకు చంద్రగిరి, నగిరి ఎమ్మె ల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్, టీటీడీ పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర గ్రీనరీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నాయకుడు దుంపూరు భాస్కర్, మాజీ సర్పంచ్ శ్రీరాజు సాదర వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

## సాయిబాబా ఆలయంలో గురుపూర్ణిమ ఉత్సవాలు

చంద్రగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధి షిరిడి సాయిబాబా మందిరంలో ఈనెల 9, 10 తేదీల్లో గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రెండు రోజులు వివిధ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు విచ్చేసి బాబా ఆశీస్సులు పొందాలని కోరారు.

## మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ

చంద్రగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 10వ తేదీ నుంచి 31 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య నిరుద్యోగ మహిళలు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి చదివి ఉండాలని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672లను సంప్రదించాలని తెలిపారు.

## 11న మెగా జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 11వ తేదీ శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం, ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. మేళాలో 11 బహుళ జాతీయ కంపెనీల్లో 400 పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పా రు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఈనెల 10వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అన్ని కంపెనీలకు అప్లై చేసు కుని అడ్మిట్‌కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు నెం.7989509540, 8919889609 లలో సంప్రదించాలన్నారు.

## రొట్టెల పండుగతో రైళ్లన్నీ కిటకిట

తడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఆదివారం నుంచి రొట్టెల పండుగ అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ పండుగకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది తరలివస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం నుంచి రైళ్లన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. సోమవారం సైతం నెల్లూరు వైపు వెళ్లే రైళ్లన్నీ కిక్కిరిసిపోయి నడిచాయి. ఈ సమయంలో రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

## ఒంటరి ఏనుగుపై అధికారుల నిఘా

- పంటలకు రక్షణగా చర్యలు



ననియాల అటవీ సమీపంలో తిరుగుతున్న ఒంటరి ఏనుగు

రామకుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని ననియాల గ్రామస్తులను 15 రోజులుగా భయభ్రాంతులకు గురిచేస్తున్న ఒంటరి ఏనుగు ఆదివారం రాత్రి పొలాలు, తోటల వైపు రాకుండా అటవీ అధికారులు ట్రాకర్లతో కలిసి అడవిలోకి తరిమేశారు. రోజూ ఏనుగు గ్రామ సమీప పొలాలు, తోటలపై దాడులు చేస్తూ అపారమైన నష్టాన్ని కలిగిస్తోంది. ఏ క్షణంలో గ్రామానికొస్తుందోనని ఆందోళనతో గ్రామస్తులు హడలిపోతున్నారు. అటవీ అధికారులు ఎంత ప్రయత్నం చేసినా అది పొలాలు, తోటల వైపు రాకుండా నిరోధించలేకపోయారు. ఆదివారం రాత్రి ఎలాగైనా ఏనుగును అడవిలోకి తరమాలని అటవీ అధికారులు, ట్రాకర్లు, గ్రామస్తులు గ్రామం నలుదిక్కులా అటవీ సరిహద్దుల్లో కాపుకాచారు. ఏనుగు అడవి నుంచి వచ్చిన వెంటనే సమాచారం అందుకున్న అధికారులు బాణసంచా పేలుస్తూ తిరిగి అడవిలోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఏనుగు పంటలవైపు వచ్చిన సమయంలో రైతులు తరిమే ప్రయత్నం చేయరాదని సూచించారు. సమాచారం అందిస్తే తాము చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పెద్దిరెడ్డి గడ్డలో మంత్రి రామ్‌ప్రసాద్‌కు ఘనస్వాగతం

- చల్లా నేతృత్వంలో పసుపుమయంగా చీకలచేను



రాంప్రసాద్‌రెడ్డిని, చల్లా బాబును గజమాలతో సత్కరిస్తున్న సదుం టీడీపీ శ్రేణులు

పుంగనూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రతిపక్షాలను అష్టకష్టాలు పెట్టి.. ఉమ్మడి చిత్తూరు జిల్లాను శాసించిన పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలం, వారి అడ్డాగా ఉన్న చీకలచేను గ్రామంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి (బాబు)లకు ఘనస్వాగతం లభించింది. సోమవారం సదుం మండలం చీకలచేనులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి పర్యటనను ఖరారు చేశారు. వైసీపీ నేత గడ్డగా ఉన్న సదుం అందులోనూ వారి గ్రామసమీపంలోనే కార్యక్రమం జరగడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది. మంత్రి పీలేరు నుంచి కల్లూరు, సదుం మండలం బూరగమంద మీదుగా టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబుతోకలిసి చీకలచేనుకు చేరుకున్నారు. ఇంటింటికీ మంత్రి స్వయంగా వెళ్లి సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా కొందరు గత ప్రభుత్వంలో భూముల రికార్డులు తారుమారు చేశారని.. 20 ఎకరాలు, 25 ఎకరాలు భూములన్నట్లు చూపి అర్హులైన తమకు తల్లికివందనం రాకుండా చేశారని వాపోయారు. పింఛన్లు మంజూరు చేయాలని, తదితర స్థానిక సమస్యలు తెలియజేయడంతో మంత్రి తీవ్రంగా స్పందించి తహసీల్దార్, ఎంపీడీవోలను పిలిపించి గ్రామంలో గత ప్రభుత్వంలో జరిగిన అవకతకలను సరిదిద్ది అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. కాగా, భారీ ఎత్తున క్రేన్‌ద్వారా ఏర్పాటు చేసిన గజమాలతో నాయకులకు స్వాగతం పలకగా.. గ్రామంలో టీడీపీ తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీలతో పసుపుమయంగా మారింది. మరోవైపు మంత్రికి ప్రతి ఒక్క నేత, కార్యకర్తను చల్లా బాబు పరిచయం చేస్తూ మహిళలతో మాట్లాడించడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

## విద్యుదాఘాతంతో ఎల్ఐసీ అధికారి మృతి



మృతిచెందిన వెంకటేశ్

కుప్పం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రకాశం రోడ్డులోని ఓ ఇంట్లో సోమవారం జరిగిన విద్యుత్తు ప్రమాదంలో ఓ ఎల్ఐసీ అధికారి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న వెంకటేశ్ (29) కుప్పం పట్టణంలోని ప్రకాశం రోడ్డులో కాపురం ఉంటున్నాడు. ఆయన శనివారం ఉదయం స్నానం చేసేందుకు బాత్రూంలో బకెట్‌లో నీళ్లు తీసుకుని, హీటర్ ఆన్ చేసి.. అందులో ఉంచేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా షార్ట్ సర్క్యూట్ కావడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## శాస్త్రోక్తంగా ధర్మరాజస్వామి ఉత్సవాల ధ్వజావరోహణం



ద్రౌపదీదేవి ఊరేగింపు - ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు - ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో కొలువై ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ధ్వజావరోహణంతో ముగిశాయి. 12 రోజుల పాటు జరిగిన ఉత్సవాలు ధ్వజావరోహణంతో ముగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రోచ్చరణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంభానికి కట్టిన చీరలను ఆచారం ప్రకారం కిందకు దింపారు. అంతకు ముందు ఉదయం ద్రౌపదీ దేవి పట్టణంలో ఊరేగారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు, ధర్మరాజస్వామి ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా అంధుల క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెటర్లతో ప్రముఖులు

తిరుపతి(క్రీడలు), జూలై 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని కేవీఎస్‌పార్కులో సోమవారం రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తిరుపతి జేసీఐ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ఇన్‌సైట్ క్రికెట్ కప్ పేరుతో నిర్వహిస్తున్న ఈ రాష్ట్రస్థాయి టోర్నీని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జాతీయ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎన్.బి.హర్షవర్ధన్ ప్రారంభించారు. ఆరు జిల్లాల నుంచి వచ్చిన అంధుల క్రికెటర్లను పరిచయం చేసుకున్నారు. పట్టుదలతో ఆడి విజయం సాధించాలని కోరారు. అంధులకు ప్రత్యేక క్రీడా మైదానాలు, శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేయాలని అభిప్రాయపడ్డారు. మూడు రోజుల పాటు లీగ్ మ్యాచ్‌లు, చివరిరోజున అంతిమ పోరు ఉంటుంది. ఈ కార్యక్రమంలో జేసీఐ తిరుపతి శాఖ చైర్మన్ శేషసాయి, గట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు గట్ల శ్రీనివాసరెడ్డి, దివ్యాంగ సేవాకేంద్రం అధ్యక్షుడు ఎస్.మునిలక్ష్మి, బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ ఫౌండర్ జాన్‌డేవిడ్ పాల్గొన్నారు.

## తిరుపతి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

● తొలి అడుగులో టీడీపీ నేతలు



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, జూలై7(ఆంధ్రజ్యోతి) : తిరుపతి అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోందని, ముఖ్యంగా సీఎం చంద్రబాబు వైజాగ్, విజయవాడ తరహాలో తిరుపతిని గ్రేటర్‌గా మార్చేందుకు సన్నాహాలు చేస్తున్నారని టీడీపీ నేతలు చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ చైర్మన్ మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో సోమవారం 4వ డివిజన్‌లోని ఉప్పంగి హరిజనవాడలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. బయో డైవర్సిటీ చైర్మన్ నీలాయపాళెం విజయకుమార్, నాయీబ్రాహ్మణ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ మంత్రి పరసారత్నం, నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, సూరా సుధాకర్ రెడ్డి, చినబాబు, నాగరాజు, కృష్ణయ్య, రమేష్ రెడ్డి, సునీల్, సుబ్రమణ్యం, మోహన్, మునిచంద్ర, తరుణ్ పాల్గొన్నారు.

## డీపీటీవోకు అభినందన



డీపీటీవోను సత్కరిస్తున్న దిపీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రజారవాణాధికారి జగదీష్‌ను ది పీటీడీ వైఎస్సార్ అసోసియేషన్ జిల్లా కమిటీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. జిల్లాలోని అన్ని డిపోలలో నూతన చార్టులు, రాబోవు బ్రహ్మోత్సవాలు, ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం, బస్టాండ్లలో సమస్యలు వంటి వాటిపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సీబీఎస్ ఏటీఎం భాస్కర్‌ను కూడా కలిశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ముఖ్య అధ్యక్షుడు ఈ.లతారెడ్డి, ఉపాధ్యక్షులు జీ.వి.ముని, జిల్లా చైర్మన్ ఎ.అల్లయ్య, అధ్యక్షులు రాంబాబు, కార్యదర్శి జి.నరసింహులు, ప్రచార కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి ఢోకాలేదు



మీడియాతో మాట్లాడుతున్న సీపీపీ సర్వే నిర్వాహకులు గండి కోట సుబ్రమణ్యం

తిరుపతి(ఆటోనగర్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనకు మంచి మార్కులు వచ్చాయని, ప్రస్తుతానికి ఎలాంటి ఢోకా లేదని సీపీపీ సర్వే చైర్మన్ గండికోట సుబ్రమణ్యం వెల్లడించారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో తమ సంస్థ సర్వే మేరకే కూటమికి సీట్లు వచ్చాయని తెలిపారు. ఏడాది పాలన తర్వాత ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 27 అంశాలపై సర్వే నిర్వహించామన్నారు. మొదటి ఏడాది ముగిసే సమయానికి చంద్రగిరి, పలమనేరు, శ్రీకాళహస్తి, చిత్తూరు, తిరుపతి, పూతలపట్టు, పీలేరులో కూటమి అభ్యర్థులు సేఫ్ జోన్‌లో ఉన్నారని తెలిపారు. మదనపల్లె, నగరి, జీడీ.నెల్లూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేల పనితీరుపై పరవాలేదనే అభిప్రాయం వచ్చిందని చెప్పారు. పుంగనూరు, తంబళ్లపల్లె, సత్యవేడు నియోజకవర్గాలు డేంజర్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నాగార్జున పాల్గొన్నారు.

## నారాయణ విద్యార్థుల మొక్కల వితరణ



మురళీమోహన్‌కు మొక్కలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అంసవేణి, జోనల్ కోఆర్డినేటర్ గాయత్రి

తిరుపతి(రవాణా), జూలై 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా నారాయణ పాఠశాల మంగళం బ్రాంచి విద్యార్థులు సోమవారం ఆర్టీవో కార్యాలయానికి మొక్కలు వితరణ చేశారు. జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్, ఎంఈఐ విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుల నుంచి మొక్కలను అందుకున్నారు. అనంతరం ఆర్టీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, విద్యాసంస్థ అధికారులతో కలిసి ఆర్టీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. డీటీవో మురళీమోహన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతగా మెలగడం అభినందనీయమన్నారు. దీనికిముందు విద్యార్థులు పాఠశాల నుంచి ర్యాలీగా ఆర్టీవో కార్యాలయానికి చేరుకున్నారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించే ప్లకార్డులు పట్టుకుని విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో మురళి, ఎంవీఐ అతికానాజ్, ఏవోలు విజయ్‌కుమార్, విజయ ప్రశాంతి, పాఠశాలల ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ఐ వసంత్, ప్రిన్సిపాల్ అంసవేణి, జోనల్ కో-ఆర్డినేటర్ గాయత్రి, ఆర్ఎస్టీ సాయి పాల్గొన్నారు.

## పురాతన మండపాలను సంరక్షించాలి

తిరుపతి(జీవకోన), జూలై 7(ఆంధ్రజ్యోతి): టీటీడీ సహకారంతో అలిపిరి పాదాలమండం వద్ద ఉన్న భక్తుల విడిది మండపానికి మరమ్మతులు చేపట్టాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. భారతీయ చరిత్రకు ఈ నిర్మాణాలు నిలువెత్తు నిదర్శనాలని, వాటిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, పురావస్తు శాఖపై ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏకపక్ష నిర్ణయాలతో తిరుమలలోని పార్వేట మండపాన్ని కూల్చివేశారని గుర్తు చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# తిరుపతి

## కపిలేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం యథావిధిగా సుప్రభాతం, అభిషేకం, అలంకరణ, అర్చన, నివేదన గావించారు. పంచమూర్తుల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, అలంకరణ చేపట్టారు. సాయంత్రం కలశస్థాపన, కలశపూజ, అగ్నికార్యం, హోమం, లఘుపూర్ణాహుతి, గ్రంధి పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను టీటీడీ ఆదరించాలి



నిరుద్యోగులకు అన్నం వడ్డిస్తున్న నారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 7 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుపేద విద్యార్థులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించేలా చూడాలని టీటీడీకి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ లైబ్రరీ వద్ద పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులను ఆయన పలకరించారు. ఉన్నత చదువులు చదివి ఆర్థిక సమస్యలతో నిరుద్యోగులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి రెండేళ్లుగా అన్నదానం చేస్తున్న వారిని అభినందించారు. టీటీడీ స్పందించి వసతి, భోజన సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

## ఎవరికీ అన్యాయం జరగకుండా చూడండి



అధికారులకు విన్నవిస్తున్న నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఉన్న టీచింగ్ అసిస్టెంట్లకు అన్యాయం జరగకుండా చూడాలని పలు విద్యార్థి సంఘాలు ఎస్వీయూ అధికారులను కోరాయి. వీసీ ప్రొఫెసర్ అప్పారావుకు మాధవ్ (సీఐటీయూ), చిన్న (ఏఐఎస్ఏ), తిరుమలేష్ (బీసీ విద్యార్థి సంఘం), శివశంకర్‌నాయక్ (జీఎన్ఎస్), శివబాలాజీ (ఎన్ఎస్‌యూఐ), అక్బర్, తేజ, శివ, విజయ్, చక్రి (ఎస్ఎఫ్ఐ) తదితరులు సోమవారం వినతిపత్రం అందజేశారు. అడ్మిషన్ల సంఖ్య తక్కువగా ఉందని, టీచింగ్ అసిస్టెంట్లను తొలిగించడం తగదని అన్నారు. ఉపాధి అవకాశాన్ని కోల్పోతే కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## భూమి.యాప్‌ను వినియోగించుకోండి



మీడియాతో మాట్లాడుతున్న వివేక్

తిరుపతి (ఆటోనగర్), జూలై 7: తిరుపతి నగరంలో ఆస్తులను సులభంగా విక్రయించుకోవడానికి భూమి.యాప్‌ను వినియోగించుకోవాలని ప్రైవేట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వాహకులు వివేక్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలో ఆస్తులను అమ్ముకోవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారని గుర్తించామని చెప్పారు. తాము రూపొందించిన యాప్ ఆస్తి యజమానులకు, రియల్ ఎస్టేట్ ఏజెంట్ల మధ్య అనుసంధానంగా ఉపయోగపడుతోందన్నారు. పూర్తి వివరాలకు 70751 70258, 70755 04817లను సంప్రదించాలని కోరారు.

## డిజిటల్ పేమెంట్స్‌ను పరిశీలించిన టీటీడీ ఈవో



తిరుమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం తిరుమలలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. శ్రీవారి పుష్కరిణి, బంగారు డాలర్ల విక్రయ కేంద్రం, అగరబత్తి, కొబ్బరికాయల విక్రయ కేంద్రం, పబ్లికేషన్ స్టాళ్లను పరిశీలించారు. డిజిటల్ పేమెంట్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొబ్బరికాయల విక్రయ కేంద్రంలో సిగ్నల్ లేకపోవడంతో డిజిటల్ పేమెంట్స్ చేసేందుకు భక్తులు ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో సమస్యను పరిష్కరించేందుకు పలు మార్గాలను అన్వేషించాలని, భక్తులకు డిజిటల్ పేమెంట్స్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని ఆదేశించారు.

# స్కానింగ్ కేంద్రంలో సిబ్బందేరి?

- రోగులకు తప్పని తిప్పలు



స్కానింగ్ కేంద్రం ముందు నిరీక్షిస్తున్న రోగులు

తిరుపతి(వైద్యం), జూలై 7(ఆంధ్రజ్యోతి): నిత్యం రోగులతో కిటకిటలాడే రుయాస్పత్రిలో మధ్యాహ్నం 12 గంటల తర్వాత స్కానింగ్ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. దీంతో స్కానింగ్ కోసం వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే రోగుల వివరాల నమోదు చేసే సిబ్బంది పరిస్థితీ అలాగే ఉంది. సోమవారం అధిక సంఖ్యలో రోగులు ఆస్పత్రికి వచ్చారు. అయితే స్కానింగ్ కేంద్రం ముందు రోగుల వివరాలు నమోదు చేసే సిబ్బంది మధ్యాహ్నం 12 గంటలకే వెళ్లిపోయారు. వారు లేరన్న సాకుతో స్కానింగ్ కేంద్రం నిర్వాహకులు తలుపులు వేసి స్కానింగ్ పరీక్షలను నిలిపేశారు. దీంతో పలువురు రోగులు స్కానింగ్ కేంద్ర నిర్వాహకులతో వాగ్వాదానికి దిగడంతో వివరాలు నమోదు చేయకుండా స్కానింగ్ చేయలేమని, అవసరమైతే రేపు రండి అంటూ ఉచిత సలహాలు ఇచ్చారు. రోగులు గంటల తరబడి స్కానింగ్ కేంద్రం ముందు నిరీక్షించి చివరకు వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం స్కానింగ్ కేంద్రం ముందు ఇదే పరిస్థితి ఉంటోందని, అధికారులు దృష్టి సారించాల్సి ఉందని కోరుతున్నారు.

# నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్‌కు 35 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మునికృష్ణ

తిరుపతి, జూలై 7(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. సుభాష్ నగర్‌లో కాలువలు, రోడ్లు ఏర్పాటు చేయాలని, ఎస్ఎల్వీ నగర్‌లో నీటి సౌకర్యం కల్పించాలని, గొల్లవాని గుంట ఆయిల్ మిల్లు వద్ద రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని, పెద్దకాపు వీధి భజన గుడి వద్ద బోర్ పైప్ మరమ్మతులు చేయించాలని, సంజయ్ గాంధీ కాలనీ భజన గుడి వద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, సిరిగిరి టవర్స్ వద్ద అక్రమ నిర్మాణం అడ్డుకోవాలని, కపిలతీర్థం నుంచి గరుడవారధి వెళ్లే మార్గంలో సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని, శివజ్యోతి నగర్ ఎస్‌బీఐ వద్ద యూడీఎస్ మరమ్మతులు చేయాలని కోరారని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ యువఅన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ ఖాన్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు.

# వీధి విక్రయదారులపై దౌర్జన్యాలను అరికట్టండి

- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి(ఆటోనగర్), జూలై7(ఆంధ్రజ్యోతి): నగరంలో వీధుల పక్కన చిరువ్యాపారాలు చేసుకునే వారిపై దౌర్జన్యాలను అరికట్టాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కోరారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం చిన్న చేపల వ్యాపారుల సంఘం సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నగరంలో చిరు వ్యాపారులపై అధికారులు, పోలీసులు, అధికార కూటమి పార్టీల్లో ఉన్న కొందరు నాయకులు దౌర్జన్యాలు చేయడమేంటని మండిపడ్డారు. వారికి లైసెన్సులు ఇప్పించకుండా మామూళ్ల వసూలు చేయడం దారుణమన్నారు. తీరు మారకపోతే సీపీఐ ఆధ్వర్యంలో తగిన రీతిలో గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. చేపల వ్యాపారులకు నగరంలో తగిన చోటు చూపాలని కోరారు. నగరంలో పరిశుభ్రతను కాపాడడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ సభలో నాయకులు విశ్వనాథ్, రాధాకృష్ణ, వీధి వ్యాపారుల సంఘం నాయకులు శ్రీనివాస్, ప్రతాప్, విక్రమ్ పాల్గొన్నారు.

# అవే సమస్యలు... ఆవేదనలు

● పీజీఆర్ఎస్‌కు పోటెత్తుతున్న అర్జీదారులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 7(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వినతులు కోకొల్లలుగా వస్తూనే ఉన్నాయి. ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 97 వినతులు వచ్చాయి. ఇందులో ప్రధానంగా భార్యాభర్తల తగాదాలు, భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలపై ఉన్నాయి. తిరుపతిలో భూ ఆక్రమణకు సంబంధించి ఒక ఫిర్యాదుదారుడు ఇప్పటి వరకు నాలుగుసార్లు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. అయినా పరిష్కారం కాలేదని అధికారుల ఎదుట వాపోయారు. ఇలాగే మరికొందరి సమస్యలు కూడా పరిష్కారం కాకపోవడంతో వారం వారం వస్తూనే ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

తిరుపతిరూరల్, జూలై7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతీ ఎస్సీకాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి, బూత్ యూనిట్ ఇన్‌చార్జి బిరుదాల సిద్ధారెడ్డి, జి.చెంగ్రామానాయుడు, రాధారాయల్, గురవారెడ్డి, బిరుదాల తులసీరామ్‌రెడ్డి, కె.శేఖర్, లెక్కలపూడి రోహిత్, సుమన్, ముని, శివ, బాలు, పవన్, పరశురామ్, రామచంద్ర పాల్గొన్నారు.

## విద్యా సామగ్రి పంపిణీ



చిన్నారులకు విద్యాసామగ్రి అందిస్తున్న మనోహర్‌చౌదరి

తిరుపతిరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీ గాంధీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో టీడీపీ గ్రామపంచాయతీ ఇన్‌చార్జి మనోహర్‌చౌదరి నేతృత్వంలో సోమవారం విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. నోటు పుస్తకాలు, పలకలు, ఆట వస్తువులు, పెన్నులు, పెన్సిళ్లు, బాక్సులు తదితర వస్తువులను అందించారు. క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు ప్రభ, రవినాయుడు, నవీన్‌కుమార్, షావలి పాల్గొన్నారు.

## కౌటిల్య విద్యార్థులకు ఎన్ఎల్‌యూ అడ్మిషన్లు



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీధర్

తిరుపతిరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌లో క్లాట్ పరీక్షకు శిక్షణ తీసుకున్న విద్యార్థులు నేషనల్ లా యూనివర్సిటీల్లో(ఎన్ఎల్‌యూ) న్యాయ కోర్సుల్లో అడ్మిషన్లు పొందారని డైరెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఎ.మాధుర్య ప్రియదర్శిని(దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ వర్సిటీ), పి.రిషితీశ్వర్ ప్రసాద్(రామయ్య లా కాలేజ్)సీట్లు సాధించారని తెలిపారు. విద్యార్థులను ఆయనతోపాటు అధ్యాపకులు అభినందించారు. కాగా ఇంటర్ విద్యార్థతతో జాతీయ స్థాయి న్యాయ విద్యాలయాల్లో ప్రవేశాలకు నిర్వహించే క్లాట్ పరీక్షకు సంబంధించి ఉచిత గైడెన్స్ కోసం ఎమ్మార్‌పల్లెలోని సంస్థ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## టీటీడీ ఉద్యోగి మృతి



హేమకుమార్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), జూలై 7(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని అసిస్టెంట్ షరాఫ్ ఎ.హేమకుమార్(39) సోమవారం మృతిచెందారు. భార్యనాలుగేళ్ల కుమారుడితో కలిసి ఆయన కొర్లగుంటలో నివాసం ఉంటున్నారు. అనారోగ్యంతో ఉన్న ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈక్రమంలో అపస్మారకస్థితిలో ఉన్న భర్తను స్థానికులతో కలిసి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు హేమకుమార్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య గాయత్రీ లక్ష్మి ఫిర్యాదు మేరకు ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి కేసు నమోదు చేశారు.

# తాళ్లపాకను అభివృద్ధి చేయండి

● టీటీడీ ఈవోకు బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి వినతి



ఈవో శ్యామలరావుకు వినతిపత్రం ఇస్తున్న భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ నేతలు

తిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు వాగ్గేయకారుడు పద కవితా పితామహుడు అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామాన్ని అభివృద్ధి చేయాలని బీజేపీ నేత, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి టీటీడీ ఈఓ శ్యామలరావును కోరారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుకుంట రమేష్ నాయుడు, తాళ్లపాక మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య కుమారుడు ఉద్దండం సుబ్రహ్మణ్యంలతో కలిసి తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలో ఈవోను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాళ్లపాక ముఖద్వారం నుంచి తాళ్లపాక వరకు రోడ్డును వెడల్పు చేయాలని, ఆ మార్గంలో ప్రముఖ కవుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. తాళ్లపాక చెరువులో అన్నమయ్య పద కవితలు రాస్తున్నట్లుగా ఒక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే తాళ్లపాకలో వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని కోరారు. అన్నమయ్య నివసించిన ఇంటి స్థలంలో ఆర్టిఫిషియల్‌గా ఆయన ఇంటి నమూనాను ఏర్పాటుచేసి, భక్తుల కోసం వసతి గృహాలు, సుదర్శన్ కౌంటర్, లడ్డు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. సిద్ధేశ్వర చెన్నకేశవస్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో కల్యాణ టికెట్లను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఈవో శ్యామలరావు సానుకూలంగా స్పందించి, తాళ్లపాక అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, అన్నమయ్య జిల్లా వైస్ ప్రెసిడెంట్, తాళ్లపాక గ్రామవాసి, ప్రముఖ న్యాయవాది వై.సురేష్ రాజు పాల్గొన్నారు.



తమిళనాడు గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

## శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్

తిరుమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణన్ రవి సోమవారం ఉదయం బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, ఇండియన్ మిలటరీ అధికారి, పరమవీర్‌చక్ర అవార్డు గ్రహీత యోగేంద్ర సింగ్ యాదవ్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



ఆర్పీ ఠాకూర్



యోగేంద్ర సింగ్ యాదవ్

## సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 88,938

తలనీలాలు సమర్పించినవారు: 28,548





## 67,988 టన్నుల తోతాపురి కొనుగోలు

- 10,046 మంది మమిడి రైతులకు ప్రయోజనం
- చివరి పంట వరకూ రాయితీ అందిస్తామన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 7(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ఈనెల నాటికి 67,988 టన్నుల తోతాపురి రకం మామిడి కాయలు కొనుగోలు అయ్యాయి. వీటిలో 45,338 టన్నులను మామిడిగుజ్జు పరిశ్రమలు సేకరించగా, మిగిలిన 22,650 టన్నులను ర్యాంపులు, మండీల్లో విక్రయించారు. తద్వారా 10,046మంది రైతులకు ప్రయోజనం చేకూరింది' అని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం వివరించారు. మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. తోతాపురి మామిడి సేకరణ ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. నిర్దేశిత ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్న ట్రాక్టర్లు, ట్రక్కుల డ్రైవర్లు, రైతులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు. తోతాపురి మామిడి సేకరణ కోసం బ్యాంకులు 20 ప్రాసెసింగ్ యూనిట్లకు టాప్ అప్ మొత్తాన్ని ఇచ్చాయని, రైతులు తమ మొత్తం దిగుబడిని అమ్మవచ్చని తెలిపారు. చివరి పంట వరకూ ప్రభుత్వం తరపున రైతులకు రూ.4సబ్సిడీ ఇస్తామన్నారు. లీజుకు తీసుకున్న రైతులకూ ఇది వర్తిస్తుందన్నారు. ఆగస్టు నెలాఖరు వరకు తోతాపురి మామిడి కొనుగోలు జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 80వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగులో ఉండగా, తిరుపతి జిల్లాలో 14,582 హెక్టార్ల విస్తీర్ణంలో 1.5లక్షల టన్నుల తోతాపురి ఉత్పత్తి ఉంటుందన్నారు. తోతాపురి మామిడి కిలో రూ.12 ధర నిర్ణయించడం జరిగింది. మామిడిగుజ్జు పరిశ్రమలు రూ.8, ప్రభుత్వం రూ.4 అందజేయడం జరుగుతుందన్నారు.

## గోవిందరాజస్వామి ఆలయంలో కవచ ప్రతిష్ఠ



తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్టాభిషేకంలో భాగంగా రెండో రోజైన సోమవారం కవచ ప్రతిష్ఠ క్రతువు వేడుకగా జరిగింది. ఉదయం శతకలశ స్నపనం, మహాశాంతి హోమం చేపట్టారు. ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆరగింపు, అనుగ్రహం వంటి కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లు తిరుచ్చిపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పెద్దజియ్యంగార్, చిన్నజియ్యంగార్, ఆలయ డిప్యూటీఈవో శాంతి, ఏఈవో మునికృష్ణ పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం: స్మగ్లర్ అరెస్ట్

వడమాలపేట,జూలై 7(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం పూడి రైల్వే స్టేషన్ వద్ద 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని స్మగ్లర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి చెప్పారు. డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, ఎస్‌ఐ ధర్మారెడ్డి సిబ్బందితో సోమవారం పూడి రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించగా మదురై నగరం మీనాంబలుపురం నేతాజీ మెయిన్ రోడ్డుకు చెందిన ఆర్ముగం కందస్వామి(55) వద్ద రూ.3 లక్షల గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సత్యప్రసాద్

### మా భూమిని వేరేవారు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు..



'సార్! నా పేరు భారతి. తిరుపతి ఐఎస్ మహల్ వద్ద ఉంటున్నాం. నా భర్త ఆనంద్ 2023 జనవరిలో ప్రమాదవశాత్తు మరణించారు. ముగ్గురు పిల్లలున్నారు. ఎలాంటి ఆదాయమూ లేదు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడ ఉత్తరపుకండ్రిగ వద్ద ప్లాట్ ఉంది. నా భర్త మరణించిన 4వ రోజే వేరే వ్యక్తి ఆ ప్లాట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు' అని మంత్రి దృష్టికి తెచ్చింది. ఇదే విషయాన్ని గతంలో మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేయాలని ఆదేశించారని గుర్తు చేశారు. స్పందించిన మంత్రి జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులను పిలిచి సమస్యను వెంటనే పరిష్కరించి, బాధితురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు.

# ప్రతి అర్జీకీ సమాధానమివ్వండి

**పీజీఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనన్న అనగాని - కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించిన మంత్రి**

తిరుపతి (కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించడానికే పీజీఆర్ఎస్ ఉందని, ఇందులో వచ్చే ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్, పీ4పై సమీక్షించడానికి అనగాని సత్యప్రసాద్ జిల్లా అధికారులతో సమీక్షించడానికి విచ్చేశారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలు ఒక్కొక్కరికిగా తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి నేరుగా వినతులను స్వీకరించారు. స్టేజ్ కిందనే కూర్చుని ఉన్న దివ్యాంగులతో నేలపై కూర్చుని వారి సమస్యలు తెలుసుకున్నారు. సహాయ పరికరాలు ఇవ్వలేదని, నిరుపేదలైన దివ్యాంగులకు ప్రభుత్వం షాపింగ్ కాంప్లెక్సుల్లో కొన్ని గదులు కేటాయించి జీవనోపాధి కల్పించాలని, త్రీవీలర్ బ్యాటరీ సైకిళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని పీడబ్ల్యూడీ ఫెడరేషన్ నాయకులు సుబ్రహ్మణ్యం, మస్తాన్ సాహెబ్ మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని పక్కనే ఉన్న కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 284 అర్జీలు అందాయి. అందులో అత్యధికంగా 149 రెవెన్యూకు సంబంధించినవే ఉన్నాయి. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోస్మాండ్, ఆర్డీవోలు భానుప్రకాశ్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



### పెరుమాళ్లపల్లెను ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి

తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా విభజించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, గ్రామస్థులు మంత్రిని కోరారు. పెరుగున్న జనాభా, భౌగోళిక విస్తీర్ణం కారణంగా ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసి, సర్వే నంబర్లు కూడా విభజించాలన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

### నా ఇంటి స్థలం కబ్జా చేశారు



బెంగళూరులో ఉన్న కుమార్తె ఇంటికి పోయి వచ్చే లోపు నా ఇంటి జాగాను గ్రామానికి చెందిన లీలావతి కుటుంబీకులు ఆక్రమించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు కూడా కూడా ఆక్రమించిన కుటుంబానికే అండగా నిలుస్తున్నారు. నిరుపేద దళితురాలినైన నన్ను బెదిరిస్తున్నారు. న్యాయం చేయండి.

- తలారి రాజేశ్వరి, కొంగరవారిపల్లె, చంద్రగిరి మండలం

### పింఛను ఇప్పించండి



అయ్యా! కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడిని. ఏడు నెలల క్రితం పక్షవాతంతో కాళ్లు, చెయ్యి పడిపోయాయి. కుటుంబ పోషణ కష్టంగా మారింది. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- డి.అయ్యర్, తిరుపతి రూరల్

# అభివృద్ధిలో జిల్లాను మొదట నిలుపుదాం

**బంగారు కుటుంబాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలి ● ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇన్‌ఛార్జి మంత్రి పిలుపు**

తిరుపతి, జూలై7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో జిల్లాను మొదటి స్థానంలో నిలపడానికి ఐదు ప్రధాన రంగాల్లోని వనరులను, అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగిన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశంలో పి4 సర్వే, బంగారు కుటుంబాల అభివృద్ధి తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. 'జిల్లాలో పీ4 సర్వేలో 80,331 బంగారు కుటుంబాలను గుర్తించాం. ఇప్పటి వరకూ ఐదు మంది దాతలు 1911 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అంగీకరించారు' అని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. 'సీఎం చంద్రబాబు రూపొందించిన విజన్ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా 2029 నాటికి జిల్లాను ఎంత వరకూ అభివృద్ధి పరచగలమో ఆలోచించండి. విజన్ యాక్షన్‌ప్లాన్ ద్వారా చరిత్రలో తొలిసారి ఎమ్మెల్యేలకు నియోజకవర్గ స్థాయిలో కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయి' అని మంత్రి అనగాని వివరించారు. తిరుపతిలో పేదలు నిర్మించుకున్న ఇళ్లకు జీవో 30 అమలు చేసేలా స్పెషల్ డ్రైవ్ పెట్టాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, ఏపీ హస్తకళల అకాడమీ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, జేసీ శుభం బన్సాల్, కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పలు అంశాలు ప్రస్తావించగా, మంత్రి, కలెక్టర్ స్పష్టత ఇచ్చారు.



ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అనగాని

### సీఎస్ఆర్ నిధుల వ్యయంలో పారదర్శకత ఏదీ?

'శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిశ్రమలు ఎక్కువ ఉన్నాయి.సీఎస్ఆర్‌కింద ఎన్ని నిధులు ఇస్తున్నాయి? ఎక్కడ ఖర్చు చేస్తున్నారనే అంశంలో పారదర్శకత ఉండటంలేదు. ఆవివరాలు ఆన్‌లైన్‌లో పెట్టాలి. కొంత శాతాన్ని స్థానిక నియోజకవర్గంలో ఖర్చు చేయాలి'అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు.

### బంగారు కుటుంబాల జాబితా ఇవ్వండి

'పీ4 సర్వే ద్వారా గుర్తించిన బంగారు కుటుంబాల జాబితా ఎమ్మెల్యేలకు ఇవ్వాలి. పరిశ్రమలు సీఎస్ఆర్ కింద ఇస్తున్న నిధుల వివరాలు ఇవ్వడంతో పాటు యజమానులతో సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుంది' అని ఎమ్మెల్యే సునీల్ కుమార్ అభిప్రాయపడ్డారు.

### సీఎస్ఆర్ నిధులతో రోడ్లు బాగు చేయాలి

'శ్రీసిటీలో 220.. వెలుపల అపోలో, హీరో, కాప్రికార్న్ వంటి పరిశ్రమలూ ఉన్నాయి. సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలోని రోడ్లు బాగు చేయాలి. పర్యాటక ప్రాంతాల్ని అభివృద్ధి పరచాలి. మోటర్ బైక్ ఉంటే బంగారు కుటుంబాల జాబితా నుంచి తొలగించడం సరికాదు' అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు.

### పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపండి

'వెంకటగిరి నియోజకవర్గంలో భూములున్నా పారిశ్రామిక వాడలు ఏర్పాటు కాలేదు. దీనిపై చొరవ చూపాలి. ప్రత్యామ్నాయంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పరచాలి' అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు.

### టెంపుల్ టూరిజంపై దృష్టి పెట్టాలి

'తిరుపతిలో పరిశ్రమలు, వ్యవసాయం, ఐటీ కంపెనీలూ లేవు. ఉన్నదల్లా సర్వీస్ సెక్టర్ మాత్రమే. టెంపుల్ టూరిజం అభివృద్ధి పరచాలి. దానికి కమిటీ వేసి నిపుణులను నియమించాలి' అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు.

### పారిశుధ్యం అధ్వానం

'తిరుపతిలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండి.. ప్రజల ఆరోగ్యం దెబ్బతినేలా వుంది. వీధుల్లో రోడ్లు, డ్రైన్లు సక్రమంగా లేవు. ప్రత్యేక నిధులు కేటాయించి పరిస్థితిని మెరుగుపరచాలి' అని ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ విజ్ఞప్తి చేశారు.

### ఇళ్లను క్రమబద్ధీకరిస్తే రూ. 400 కోట్లు

'తిరుపతి రూరల్ మండలంలో మఠం భూములను కొని 30 ఏళ్ల కిందట ఇళ్లు కట్టుకున్నారు. ప్రభుత్వం రోడ్లు, కాలువలు నిర్మించి కరెంటు కూడా ఇచ్చింది. మఠం భూములనే పేరుతో నిషేధిత జాబితాలో పెట్టారు. దాంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. నిషేధిత జాబితా నుంచీ ఆ భూములను తొలగించి క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వానికి రూ. 400 కోట్ల వరకూ ఆదాయం వస్తుంది. కావాలంటే మఠానికి ప్రత్యామ్నాయ భూములిస్తాం' అని ఎమ్మెల్యే పులివర్తి నానీ సూచించారు.

### నైపుణ్య శిక్షణలో ఎస్వీయూ సహకారం

'యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఎస్వీయూ సహకరిస్తుంది. ఇప్పటికే డ్రోన్ అండ్ స్పేస్ టెక్నాలజీ అంశంలో ఎంవోయూ కుదుర్చుకున్నాం. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో డ్రోన్ వినియోగంపై శిక్షణ, ఆపరేషన్, రిపేర్లు వంటివి చేపడతాం. ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు శిక్షణ ఇస్తాం' అని వీసీ అప్పారావు పేర్కొన్నారు.

### మహిళాభివృద్ధికి తోడ్పాటు

'మహిళలకు ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణకు పద్మావతీ వర్సిటీ తోడ్పడుతుంది. ఏఐ, ఫ్యాషన్ టెక్నాలజీ తదితరాలపై దృష్టి పెడుతున్నాం. ఇప్పటికే 47 స్టార్టప్‌లు వున్నాయి. మహిళా బయోటెక్ పార్కు వుంది. తిరుపతిలో రెండు మురికివాడలు కేటాయిస్తే విద్యార్థులను పంపి పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తాం. ఇంటర్న్‌షిప్స్ నిర్వహిస్తాం. పూర్వ విద్యార్థులను పీ4లో భాగస్వాముల్ని చేస్తాం' అని వీసీ ఉమా తెలిపారు.

## విద్యార్థులు.. ఉపాధ్యాయులు 100శాతం హాజరు

- రాష్ట్రంలో జిల్లా విద్యాశాఖ రికార్డ్

తిరుపతి(విద్య), జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ రాష్ట్ర స్థాయిలో అరుదైన రికార్డ్‌ను సాధించింది. అన్ని పాఠశాలల్లో నమోదైన విద్యార్థులు, అన్ని పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం వందశాతం పాఠశాలలకు హాజరయ్యారని డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. పాఠశాలలు ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే... ఈ అరుదైన రికార్డును సాధించడంపట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 100 శాతం హాజరు నమోదు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ నిత్యం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మార్గనిర్దేశం చేస్తూ వచ్చారని... ఆమేరకు రాష్ట్రంలో జిల్లా ఆ ఘనతను సాధించందన్నారు. ఉన్నతాధికారులు డీఈఓ ఇతర అధికారులను అభినందించారు. 100 శాతం హాజరుకు కృషి చేసిన అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు డీఈవో కుమార్, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.గౌరీశంకర్‌రావు, పషియల్ అటెండెన్స్ నోడల్ అధికారి జి.సురేష్ అభినందనలు తెలియజేశారు.



100 శాతం హాజరు పోస్టర్లను ప్రదర్శిస్తున్న డీఈవో

## భరతనాట్యంలో వరల్డ్ రికార్డు

తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నటరాజ నర్తన ఆకారంలో 27.32 నిమిషాల పాటు భరతనాట్యంతో తిరుపతికి చెందిన బాలికలు వరల్డ్ రికార్డును కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తమిళనాడు సేలంలోని కైలాస మానససరోవరం స్కూల్‌గ్రౌండ్‌లో ఇంటర్‌నేషనల్ టైమ్స్ అండ్ వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భరతనాట్యంలో 'నటరాజ నర్తనం' ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2వేల మంది బాల కళాకారులు ప్రాతినిధ్యం వహించారు. అందులో తిరుపతి నుంచి సింహాల లేక్షణసాయి, కందుల హవిష, బి.ప్రశ్విత్‌శ్రీ, సి.కేతన పాల్గొని నటరాజనర్తన ఆకారంలో 27.32నిమిషాలు నృత్యం చేసి అహూతులను అబ్బురపరిచారు. తమిళ సినీనటి, క్లాసికల్ డ్యాన్సర్ ప్రియదర్శిని చేతుల మీదుగా నలుగురు బాలికలు ప్రశంసపత్రాలు, బహుమతులు అందుకున్నారు.



వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లు చూపుతున్న బాలికలు

# రాష్ట్రంలో అభివృద్ధి శకం మొదలైంది

**సత్యవేడులో శంకర్‌రెడ్డి పరిచయ కార్యక్రమంలో మంత్రి అనగాని**

సత్యవేడు , జూలై 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శకం మొదలైందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సత్యవేడులోని బేరిశెట్టి కల్యాణ మండపంలో సోమవారం జరిగిన నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా నియమితులైన కూరపాటి శంకర్‌రెడ్డి పరిచయ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. 2019లో అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. విభజిత రాష్ట్రంలో చంద్రబాబు వేసిన అభివృద్ధి పునాదుల్ని ఛిన్నాభిన్నం చేసి రాష్ట్రాభివృద్ధిని 40 ఏళ్ళు వెనక్కినెట్టేసిందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళు సాగించిన విధ్వంస పాలన నుండి రాష్ట్రం ప్రస్తుతం వికాసం వైపునకు పయనిస్తోందని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ పింఛన్, తల్లికి వందనం, దీపం పథకం, డీఎస్సీ, అన్నదాత సుఖీభవ తదతర పథకాలు సూపర్ సిక్స్‌లో చెప్పినవి చెప్పినట్లు అమలు చేస్తున్నారని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు.

### శంకర్‌రెడ్డికి సహకరించండి

నియోజకవర్గ పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా నియమితులైన శంకర్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. అభివృద్ధిపై తపన కలిగిన వారని, నాయకత్వ లక్షణాలున్న వ్యక్తన్నారు. కేవలం 19 మంది ఎమ్మెల్యేలతో పార్టీ క్లిష్టపరిస్థితుల్లో ఉన్న సమయంలో శంకర్‌రెడ్డి పార్టీకి అండగా నిలబడి తమందరికీ మనో ధైర్యాన్ని అందించారని తెలిపారు. తమందరికన్న టీడీపీ అధినేత చంద్రబాబుతో సన్నిహితంగా ఉంటారన్నారు. ఆయన సారథ్యంలో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. సత్యవేడులోని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కోఆర్డినేటర్‌గా నియమించారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు విభేదాలుమాని అధినేత ఆదేశాలను పాటించి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



శంకర్‌రెడ్డిని నేతలకు పరిచయం చేస్తున్న మంత్రి

### చంద్రబాబు, లోకేశ్‌లకు కృతజ్ఞతలు: శంకర్‌రెడ్డి

శంకర్ రెడ్డి మాట్లాడుతూ తనను పార్టీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. అందరం కలిసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే హేమలత, కో ఆర్డినేటర్ శ్రీపతిబాబు, చందనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ

తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోవాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో వచ్చేనెల ఏడో తేదీన జాతీయ ఓబీసీ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, కేశన శంకరరావు తెలిపారు. తిరుపతిలోని పద్మావతి గెస్ట్‌హౌస్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి, బీసీ డిమాండ్ల సాధన కోసం, భవిష్యత్తు కార్యచరణను రూపొందిస్తామన్నారు. 2026లోనే కులగణన పూర్తిచేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోరారు. జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్‌యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొబ్బిసేని రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

### ఇంగ్లీషు చదవడం కష్టంగా ఉందని...

## ముగ్గురు విద్యార్థుల పరార్

రేణిగుంట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లీష్ మీడియం చదవడం ఇష్టం లేక పరారైన ముగ్గురు విద్యార్థులను పోలీసులు చైల్డ్ హోంకు చేర్చారు. తిరుపతిలోని చైల్డ్ హోం సంరక్షణలో ఉన్న వీరిని సోమవారం ఉదయం సిబ్బంది కాన్వెంట్ వద్ద దింపి వెళ్లిపోయారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకుండా పరారయ్యారు. కరకంబాడి వద్ద తిరుతుండగా పోలీసులు గుర్తించి విచారించారు. తమకు ఇంగ్లీష్ మీడియం చదవడం కష్టంగా ఉందని, ఎవరికి చెప్పాలో అర్థం కాకుండా పారిపోయామని చెప్పారు. రేణిగుంట అర్బన్ పోలీసులు చైల్డ్ హోం సిబ్బందిని పిలిపించి విద్యార్థులను అప్పగించారు.

## కాలువ పూడికతీతకు చర్యలు



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారెడ్డిపాళెం గ్రామ సమీపంలో ఉన్న బల్లవోలు డ్రైనేజీ పథకానికి సంబంధించి కాలువ పూడికతీత పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వర్షాల సమయంలో వరదనీరు వెళ్లపాళెం, బల్లవోలు, చింతవరం, రామారెడ్డిపాళెం, వల్లమాల తదితర గ్రామాల్లోని పొలాల్లోకి చేరి సకాలంలో వరినాట్లు వేయలేక అవస్థలు పడుతున్నామన్నారు. కాలువల్లో పూడిక తీయడం వల్ల వరదనీరు కాలువ ద్వారా సముద్రంలోకి చేరుతుందన్నారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వరినాట్లు వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దువ్వూరు వినయ్‌కుమార్‌రెడ్డి, రావుల వెంకటేశ్వర్లు, పూడిపర్తి ప్రవీణ్‌కుమార్, అన్నం మునిశేఖర్‌గౌడ్, చెరుకూరు పద్మజ, లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికే మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

చిల్లకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే మహాసభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. సోమవారం మండలంలోని నెలబల్లిరెట్టపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో ద్వితీయ మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహసభలు నిర్వహించి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సీపీఐ కృషి చేస్తుందన్నారు. నక్కలవారి కండ్రిగలోని ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వాలన్నారు. ప్రభాకర్, చిన్న పెంచలయ్య, సీవీఆర్ కుమార్, నారాయణ, రమేష్‌బాబు, రాఘవయ్య, మస్తానయ్య, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## గురుపూర్ణిమ వేడుకలకు ముస్తాబవుతున్న సాయిబాబా ఆలయాలు



సాయిబాబా ఆలయంలో విగ్రహాలకు అలంకరణ

నాయుడుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమ మహోత్సవాలకు నాయుడుపేటలోని బ్రాహ్మణవీధిలోని షిరిడీసాయిబాబా మందిరం, రాజగోపాలపురంలోని సాయిబాబా మందిరం సోమవారం ముస్తాబవుతున్నాయి. షిరిడీ సాయిబాబా ఆలయంలో మంగళవారం సాయిబాబాను విశేష పుష్పాలంకరణ, అన్నప్రసాదాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు. బుధవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, చిన్నపిల్లలచే వివిధ రకాల సాంస్కృతిక నాటికలు, మిమిక్రీ, గురువారం గురిపూర్ణిమ సామూహిక శ్రీసాయి సహస్రనామ పూజలు, అభిషేకాలు, అర్చనలు, అన్నదానం, నటరాజ గ్రూపు ఆధ్వర్యంలో నాటక, నృత్య ప్రదర్శనలు, నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరాం ప్రసాద్ తెలిపారు.

## ఉపాధి పనులు కల్పించకపోతే ఉద్యమిస్తాం



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న చంద్రశేఖరపురం ఉపాధి కూలీలు

కోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు సక్రమంగా కల్పించని కారణంగా పస్తులు ఉంటున్నామని, తక్షణం పని చూపకపోతే ఉద్యమిస్తామని చంద్రశేఖరపురం కూలీలు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం గూడలి పంచాయతీ పరిధిలోని చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన నిరసన తెలిపారు. తమ గ్రామంలో ఉన్న కూలీలకు రెండు వారాలకోసారి పనులు కల్పిస్తున్నారని, అంతేకాకుండా గ్రామం నుంచి 7 కిలోమీటర్ల దూరంలో నడిచి వెళ్లి పనులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సూళ్లూరుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఎంఆర్పీఎస్ 31వ ఆవిర్భవ దినోత్సవాన్ని సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిక జన్మదిన వేడుకల్లో భాగంగా ఉచ్చూరు రఘు ఆధ్వర్యంలో పట్టణంలోని మహదేవయ్య నగర్, మండల పరిధిలోని మంగళంపాడు, ఇలుపూరు, దామానెల్లూరు గ్రామాల్లో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు కయ్యూరపు మురళి, సాయి, చిలకల శ్రీనివాసులు, మాచారం చెంగమ్మ, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

**వెంకటగిరి:** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. అలాగే మందా కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా పట్టణంలోని కాశీపేట సెంటర్‌తో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పల్లిపాటి రవి, మంగళంపూరి సురేష్, కంటిపల్లి మని, వెంకి, సుదా, శాతరాశి బాలయ్య, కోటి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

**చిట్టమూరు:** మండల పరిధిలోని చిన్న దరఖాస్తు గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కంటేపల్లి మస్తానయ్య ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ నాయకులు రాజేష్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ఈశ్వరవాక, కలుగుర్తిపాడు, ఎం జంగాళపల్లి గ్రామాల్లో ఎంఆర్పీఎస్ జెండా ఆవిష్కరించారు.

## తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), జూలై7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో సోమవారం రైల్వే బోర్డు ప్రిన్సిపుల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలేంద్రసింగ్ తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఆరు ప్లాట్‌ఫారాల్లో ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. విశ్రాంతి గదులు, టికెట్ కౌంటర్లు, పలు కార్యాలయాలను సందర్శించారు. ప్రిన్సిపుల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ మధుసూదనరావు, ఏడీఆర్ఎం యు.సుధాకర్, డిప్యూటీ సీఈ వామనమూర్తి, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు డాక్టర్ కె.చిన్నపరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

## బొగ్గులమిట్టలో తాగునీటి కొరత

వెంకటగిరి టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొగ్గుల మిట్ట, ధర్మాపురం, నరసింహారవు వీధి తదితర ప్రాంతాల్లో తాగునీరు సరఫరా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య అన్నారు. సోమవారం 14వ వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మూడు నెలల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. వార్డులో 25 విద్యుత్ దీపాలు వెలగడం లేదని చెప్పారు. మున్సిపాలిటీ అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## వేనాడు దర్గా కిటకిట

తడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేనాడు దీవిలో ఉన్న దావూద్ షావల్లి అల్లాతాత దర్గా ఆదివారం నుంచి కిటకిటలాడుతోంది. నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు వచ్చే భక్తులు వేనాడు దర్గాకు వచ్చి బాబాను దర్శించుకోవడం ఆనవాయితీ. దీంతో దర్గా ప్రాగణం భక్తులతో కిటకిటలాడుతోంది. మరో మూడు రోజులపాటు దర్గాలో భక్తుల రద్దీ కొనసాగనుంది.

## సంపద తయారీ కేంద్రాల పరిశీలన

బాలయపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పల్లిపాడు, మన్నూరు, అలిమిలి, నిండలి, కడగుంట పంచాయతీల్లో సోమవారం ఎంపీడీవో వినీల్‌కుమార్ పర్యటించారు. ఆయా పంచాయతీల్లో చేతిపంపుల పనితీరు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.





సూళ్లూరుపేటలో తాళం వేసివున్న గ్రంథాలయం - తడలో తలుపులు తెరుచుకోని లైబ్రరీ

# గ్రంథాలయం ఎప్పుడు తెరుస్తారో?

### సూళ్లూరుపేట లైబ్రరీ రెండు వారాలుగా మూత ● తడ, దొరవారిసత్రంలోనూ అదే పరిస్థితి

సూళ్లూరుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎందరికో విజ్ఞాన్ని అందించిన సూళ్లూరుపేట గ్రంథాలయం నేడు తలుపులు తెరుచుకోవడం లేదు. నియోజకవర్గ కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం వద్దనున్న గ్రంథాలయం 15 రోజులకు ఒకసారి కూడా తెరవడం లేదు. పనివేళల్లో పాఠకులు వచ్చి వార్తాపత్రికలు, వార, పక్ష, మాస పత్రికలతో పాటు ఇతర గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు చదువుకునేందుకు రోజుకు 150 మందికి పైగా పాఠకులు వస్తుంటారు. ఏటా వేసవిలో విద్యార్థుల కోసం నిర్వహించే ప్రత్యేక శిక్షణ శిబిరం కూడా ఈ సారి ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఇక్కడ పనిచేసే గ్రంథాలయ అధికారి గతంలో వారంలో మూడు రోజులు ఇక్కడ, మరో మూడు రోజులు నెల్లూరులో విధులు నిర్వహించేవారు. సిబ్బంది కొరతతో వారంలో మూడు రోజులే సూళ్లూరుపేటలో గ్రంథాలయం తెరిచేవారు. అయితే జూన్ నెల నుంచి సక్రమంగా గ్రంథాలయం తెరవడం లేదని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెల 24 నుంచి ఇప్పటి నేటి వరకు గ్రంథాలయం తలుపులు తెరవలేదని చెబుతున్నారు. ఇక తడ, దొరవారిసత్రంలో కూడా ఇదే పరిస్థితి. ఏ రోజు గ్రంథాలయాలు తలుపులు తెరుచుకుంటాయో పాఠకులకు తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ ఉద్యోగిని నియమించి రోజు గ్రంథాలయం తెరవాలని పాఠకులు కోరుతున్నారు.

# సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం: పాశం

గూడూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మిటాత్మకూరు, ఈదలపల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అరాచకపాలన సాగించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతిపాలు చేసిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పింఛన్లను రూ.4వేలకు పెంచడంతో పాటు ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దనే అందిస్తున్నామన్నారు. దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం అమలు పరచడం జరిగిందన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళుతున్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, శ్రీహరి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

# పాఠశాలల విలీనంతో పేద విద్యార్థులకు విద్య దూరం



ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్నట్లు సీఐటీయూ, విద్యార్థి సంఘ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల విలీనంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా చేశారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల నుంచి 12 గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు విచ్చేసి పాఠశాలల విలీన ప్రక్రియను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం పాఠశాలల విలీనం చేయడం వల్ల చాలామంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, ముఖ్యంగా గిరిజన సెంటర్లు, దళితవాడలకు చెందిన పేద విద్యార్థులు కిలో మీటర్ల దూరం వెళ్లలేని పరిస్థితిలో చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ పునరాలోచించి పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలన్నారు. అనంతరం ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు నాగరాజు, సుమన్, సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

చిల్లకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎనిమిదేళ్ల పాటు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించిన ఉపాధ్యాయులు చంద్ర, వీవీ కుమార్, మంజుశ్రీ, ఆదిలక్ష్మి, సురేంద్రను హెచ్ఎం అనసూయ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మాధవయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి, సుగుణ, లీల, కామేశ్వరి, మధుసూదన్‌రావు, విద్యుల్లత పాల్గొన్నారు.

## గురువులకు దుస్తుల పంపిణీ

వాకాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి అచెల పరిపూర్ణ ఆశ్రమంలో గురుపూర్ణిమ వేడుకల్లో భాగంగా ఆధ్యాత్మిక గురువులకు సీతారామ ధార్మికసేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రవాస భారతీయులు వెంకటసాయికృష్ణ, పూర్ణచంద్రరావు, మీన, అముక్త కుటుంబసభ్యుల దాతృత్వంతో 20 మంది గురువులకు వస్త్రాలు అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు దివి అనంతాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



కరపత్రాలతో సీఐటీయూ నాయకులు

గూడూరు అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈనెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి బీవీ రమణయ్య అన్నారు. సోమవారం మండలంలోని నెల్లటూరు విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్స్ హమాలీల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాఘయ్య, రమేష్, మస్తాన్, జనార్దన్, రాఘవరావు, గోవర్ధన్, సుబ్బయ్య పాల్గొన్నారు.

## మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ

చంద్రగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 10వ తేదీ నుంచి 31 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య నిరుద్యోగ మహిళలు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి చదివి ఉండాలని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672లను సంప్రదించాలని తెలిపారు.

## పామాయిల్ సాగుపై మొగ్గు చూపండి

రామచంద్రాపురం: జూలై 7(ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుపై రైతులు మొగ్గు చూపాలని ట్రీఎఫ్ ఆయిల్‌ఫాం కంపెనీ ఉమ్మడి జిల్లా మేనేజరు వెంకట మురళి కోరారు. రావిళ్లవారిపల్లెలో సాగులో ఉన్న పామాయిల్ తోటలను ఆయన సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. పామాయిల్ తోటలకు ప్రభుత్వం పూర్తిగా సబ్సిడీ ఇస్తోందన్నారు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

## సైనికుల్లా పనిచేస్తాం



భాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న మోహన్‌రెడ్డి తదితరులు

కోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే టీడీపీ బలోపేతానికి కృషి చేసి సైనికుల్లా పనిచేస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, పెన్నక్క చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొక్కుపాడులో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన పలగాటి భాస్కర్‌రెడ్డిని మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, మురళీరెడ్డి, రమేష్‌రెడ్డి, కిరణ్ కుమార్, సుధీర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, నారాయణరావు, ఎంపీటీసీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయండి

పెళ్లకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం పెళ్లకూరు మండలంలో పర్యటిస్తారని, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య కోరారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు తాళ్వాయిపాడు, 11.00 గంటలకు ఎగువ కానూరు, సాయంత్రం శిరసనంబేడే, చెక్‌పోస్టు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని తెలిపారు.

## పశుగ్రాసం వినియోగంతో అధిక లాభాలు

గూడూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల పశుగ్రాసాన్ని దాణాగా వినియోగించడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చునని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పాడిరైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకవార్షిక ధాన్యపు జాతికి చెందిన మొక్కజొన్న, జొన్న, సజ్జ బహువార్షికాలైన ధాన్యపు జాతికి చెందిన పారాగడ్డి, సూపర్ నేపియర్ తదితర జాతులను సాగు చేసుకుని పశువులకు దాణాగా వినియోగించుకోవచ్చునన్నారు. దీంతో పాల ఉత్పత్తి పెరగడంతో ఖర్చులు తగ్గి పాడి రైతులకు లాభదాయకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కాంచన, బత్తిని శ్రీనివాసులు, గాయత్రి, పాడి రైతులు పాల్గొన్నారు.





పశుగ్రాసంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేష్

## మంగళ, గురువారాల్లో పలు రైళ్ల రద్దు

తడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలో గుమ్మడిపూడి, పొన్నేరి మధ్య ఇంజనీరింగ్, సిగ్నల్ మార్పు, పట్టాల మార్పు పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం(నేడు), గురు వారాల్లో ఉదయం 9:15నుంచి మధ్యాహ్నం 3:15 వరకు పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే డివిజన్ అధికారులు ప్రకటించారు.

**రద్దైన రైళ్ల వివరాలు...**

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 8:10 నిమిషాలకు బయలుదేరి వెళ్లే రైలు నంబరు 66035
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10:40 నిమిషాలకు బయలుదేరి వచ్చే రైలు నంబరు 66036
- చెన్నైమోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5:40, 8:35, 10:15, మధ్యాహ్నం 12:10కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 10:00గంటలు, 11:45, మధ్యాహ్నం 12:35, 1:15కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నైమోర్‌మార్కెట్‌కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 8:05, 9:00, 9:30, 9:40, 10:30, 11:35, మధ్యాహ్నం 12:40కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైమోర్‌మార్కెట్‌కాంప్లెక్స్ ఉదయం 9:10, 9:55, 10:55, 11:25, మధ్యాహ్నం 12:00, 1:00, 2:30కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.

అలాగే చెంగల్‌పట్టు, గుమ్మిడిపూడి, తాంబరం మధ్య నడిచే పలు లోకల్ రైళ్లు పాక్షికంగా రద్దు కాగా, పలు రైళ్లు చెన్నై, మీంజూరు మధ్య నడవనున్నాయి.

### రొట్టెల పండుగతో రైళ్లన్నీ కిటకిట

తడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఆదివారం నుంచి రొట్టెల పండుగ అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ పండుగకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది తరలివస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం నుంచి రైళ్లన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. సోమవారం సైతం నెల్లూరు వైపు వెళ్లే రైళ్లన్నీ కిక్కిరిసిపోయి నడిచాయి. ఈ సమయంలో రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

## స్వర్ణముఖిలోకి మిగులు జలాలు



గూడలి స్వర్ణముఖినదిలో చేరుతున్న మిగులు జలాలు

కోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలి వద్ద స్వర్ణముఖినదిలోకి మూడు రోజులుగా మిగులు జలాలు వస్తున్నాయి. దీంతో ఆ జలాలను కొత్తమంది రైతులు పెన్నాక చెరువులోకి, కొత్తమంది రైతులు వాకాడు బ్యారేజీలోకి మళ్లించుకుంటున్నారు. నాయుడుపేట ఎగువ ప్రాంతం నుంచి గంగ కాలువల ద్వారా వచ్చేనీరు అనధికారికంగా కొన్ని గ్రామాల రైతులు మామిడి కాలువలోకి మళ్లించుకోగా ఆ కాలువ నుంచి మిగులు జలాలను గూడలి వద్ద మామిడి కాలువ, స్వర్ణముఖినది ద్వారా అటు పెన్నాక చెరువు, వాకాడు బ్యారేజీలోకి మళ్లించుకుంటున్నారు.

## స్వర్ణమ్మకు జలకళ

వాకాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినదిలో సోమవారం జలకళ సంతరించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా స్వర్ణముఖినదిలో నీరులేక వెలవెలబోయింది. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చొరవతో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల ప్రజల దాహార్తిని, రైతుల సాగునీటి అవసరాల కొరకు తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులతో సంప్రదింపులు జరిపి ఆగస్టు 15వ తేదీ వరకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పరిశీలన



మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ నోడల్ బృందం

వాకాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని రాష్ట్ర విద్యాశాఖ నోడల్ బృందం అధికారి రమేష్ సోమవారం పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, ఫేషియల్ రికగ్నైజేషన్, అటెండన్స్ యాప్, మధ్యాహ్న భోజన అమలు తీరుపై సమీక్షించారు. ప్రాథమిక స్థాయిలో మౌలిక, గణిత సామర్థ్య సాధన, ఉన్నత పాఠశాలల్లో అభ్యసన అభివృద్ధి కార్యక్రమం అమలు తీరును మండల విద్యాశాఖ అధికారి నసీం ఆలీని అడిగి తెలుసుకున్నారు.

## మున్సిపల్ కార్మికుల నిరసన

వెంకటగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, సమ్మె కాలం ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు సమ్మె కాలం ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## మంత్రి లోకేశ్‌కు సాదర వీడ్కోలు



రేణిగుంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు సాదర వీడ్కోలు పలికారు. నెల్లూరు జిల్లాలో జరిగిన కార్యక్రమాన్ని ముగించుకొని సోమవారం రాత్రి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు చంద్రగిరి, నగిరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్, టీటీడీ పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర గ్రీనరీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నాయకుడు దుంపూరు భాస్కర్, మాజీ సర్పంచ్ శ్రీరాజు సాదర వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి: సుధీర్



సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తున్న సుధీర్

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ కోరారు. తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా యాక్షన్ ప్లాన్ యూనిట్ సమీక్షా సమావేశం మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమీక్షకు హాజరైన ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలను ప్రస్తావించారు. అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

## సమస్యలు పరిష్కరించండి: ఆదిమూలం



పిచ్చాటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌లో సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి పనులు పొందుపరచినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యవేడు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతో పాటు కొత్త పనులను పొందుపరిచినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి అనగానికి వినతిపత్రం సమర్పించానన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి



కరపత్రాల పంపిణీలో శంకర్‌రెడ్డి తదితరులు

సత్యవేడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వీఆర్‌కండ్రిగలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాగాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల కరపత్రాలను పంచారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే హేమలత, నాయకులు చందనశ్రీ, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, రామాంజులు నాయుడు, సతీష్ నాయుడు, శ్రీనివాసయాదవ్, ఎండీ కుమార్, అన్ను, సుధాకర్ నాయుడు, కన్నయ్య నాయుడు, గిరి, పరమశివం, చిన్న, యాచేంద్రనాయుడు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు ఇంటి స్థలాలివ్వాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు దళితులకు ఇంటి స్థలాలివ్వాలని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య డిమాండ్ చేశారు. బీఎన్‌కండ్రిగలో జరిగిన పార్టీ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కనమనంబేడు సర్వే నెం.252, 253, 254లలో ఉన్న ప్రభుత్వ భూముల్లో పట్టాలివ్వాలని కోరారు. గ్రామంలోని అనేక మందికి ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## పేరుకుపోయిన చెత్త తొలగింపు

పిచ్చాటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచ్చాటూరు, కీళపూడి, వేలూరు, నీరువాయి, వెంగళత్తూరు గ్రామాల రహదారుల వెంబడి పేరుకుపోయిన చెత్తను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఆయా గ్రామాల సర్పంచులతో కలసి ఎంపీడీవో మహ్మద్‌రఫి చెత్త తొలగింపులో పాల్గొన్నారు. వర్షాకాలం ప్రారంభం కానుడడంతో ముందస్తు చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

## అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



ఓబులాయపల్లిలో కరపత్రాల పంపిణీ

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధికి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు సమ ప్రాధాన్యం ఇస్తున్నారని టీడీపీ నాయకులు చెప్పారు. ఓబులాయపల్లి, రెడ్డిపల్లిల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నార న్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్, నాయకులు సుబ్బారెడ్డి, జగన్నాథ నాయుడు, రవీంద్రనాథ్, కామేష్‌యాదవ్, సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

- తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు ఆధ్వర్యంలో పెన్నలపాడులో పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు నాయకులు జయచంద్ర నాయుడు, లెక్కల మురళీనాయుడు, కొన్నలి రమేష్, చెంచయ్య, సుబ్రహ్మణ్యం, రాజేష్, మస్తాన్‌నాయుడు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

**ఏర్పేడు (ఆంధ్రజ్యోతి):** అర్హులైన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పేరం ధనంజయులునాయుడు అన్నారు. మండలంలోని కొత్తవీరాపురంలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు గురవారెడ్డి, పొన్నారావు, నాగరాజునాయుడు, శివశంకర్‌రెడ్డి, రామదాసు, మురుగన్, గిరినాయుడు, గౌరి, భూపతి యాదవ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పుత్తూరు వార్తలు

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి: ఎమ్మెల్యే భానుప్రకాష్



వృద్ధుడిని పలకరిస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకు రావాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో గోపాలకృష్ణపురంలో సుపరి పాలనలో తొలిఅడగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కరపత్రాలను అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాభాస్యం చేయించారు. తల్లికి వందనం గురించి, అలాగే పాఠశాలలో మౌలిక వసుతుల గురించి ప్రైమరీ పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశువుల నీటి తొట్టెను ప్రారంభించారు. గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన ల్యాండ్ టైటిల్ రద్దుకు గుర్తుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు అందించిన చిక్కీలపై కూడా బొమ్మలు వేసుకున్న ఘనత అప్పటి ముఖ్యమంత్రిదేనని అని ఎద్దేవా చేశారు. విద్యాశాఖలో చేసిన సంచలనాత్మక మార్పులకు, భవిష్యత్తు తరాల వారికి భరోసా కల్పించిన మంత్రి లోకేశ్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

వడమాలపేట,జూలై 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకొని పాదిరేడుకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి చెప్పారు. సోమవారం బైపాస్ రోడ్డు సమీపంలో గంగమ్మ గుడి వద్ద మండలంలోని పాదిరేడుకు చెందిన జి.మాదవయ్య(63) అక్రమంగా 20క్వార్టర్ల మద్యం బాటిళ్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి పుత్తూరు ఏడిఎం కోర్టులో హాజరు పరచినట్లు ఎస్‌ఐ చెప్పారు.

## ప్రసన్న ఆంజనేయుడి సేవలో టీడీపీ సమన్వయకర్త శంకర్‌రెడ్డి

పిచ్చాటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కీళపూడి ప్రసన్నాంజనేయస్వామిని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త శంకర్‌రెడ్డి దర్శించు కున్నారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.

## శాస్త్రోక్తంగా ధర్మరాజస్వామి ఉత్సవాల ధ్వజావరోహణం



ద్రౌపదీదేవి ఊరేగింపు - ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు - ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో కొలువై ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ధ్వజావరోహణంతో ముగిశాయి. 12 రోజుల పాటు జరిగిన ఉత్సవాలు ధ్వజావరోహణంతో ముగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రోచ్ఛరణల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంభానికి కట్టిన చీరలను ఆచారం ప్రకారం కిందకు దింపారు. అంతకు ముందు ఉదయం ద్రౌపదీ దేవి పట్టణంలో ఊరేగారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు, ధర్మరాజస్వామి ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## వార్డెన్లు పిల్లలతో పాటు హాస్టల్లో వండినవే తినాలి: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లో పనిచేసే వార్డెన్లు ప్రతి పూటా విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని తినాలని ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల శ్రీకాళహస్తిలోని రెండు బీసీ వసతిగృహాల్లో ఆహారం కలుషితం కావడంతో విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై దుమారం రేగిన విషయం తెలిసిందే. దీనిపై ఆర్డీవో వసతిగృహ అధికారులతో పరిస్థితులపై ఆరాతీశారు. వసతిగృహంలో శుద్ధజలాల ప్లాంట్ ఏర్పాటుపై చర్చించారు. అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు మునీంద్ర, ఉదయేశ్వరి, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### బీసీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ



విద్యార్థికి వడ్డిస్తున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారి

**ఏర్పేడు (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలో బీసీ సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సోమవారం సాయంత్రం 7.30గంటలకు జిల్లా బీసీ సంక్షేమ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనం, మెనూను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం ఆయనే వడ్డించారు. వారితో కలిసి భోజనం తిన్నారు. ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని సూచించారు. హాస్టల్‌లో సమస్యలుంటే చెప్పాలని అడిగారు. మెనూ ప్రకారం భోజనం, ఇతర సదుపాయాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతిగృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరశీలించారు. బీసీ సంక్షేమ అధికారి జ్యోత్స్న పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రిలో అలంకారప్రాయంగా అధికార యంత్రాంగం

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో అధికార యంత్రాంగం అలంకారప్రాయంగా మారింది. కొందరు ఉదయం ఓపీ సమయానికి రావడం, కొందరు మధ్యాహ్నమే వెళ్లిపోవడం, మిగిలిన వారు సాయంత్రం 4గంటలకంతా దుకాణం సర్దేయడం పరిపాటిగా మారింది. కేవలం స్టాఫ్‌నర్సులు, పారిశుధ్య, సెక్యూరిటీ మాత్రమే రాతంత్రా విధులు నిర్వహించాల్సి వస్తోంది. సాధారణంగా ఆస్పత్రిలో కీలక స్థానాల్లో బాధ్యతలు నిర్వహించే అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. రెండు సంవత్సరాల నుంచి సాయంత్రం 4 తరువాత ఆస్పత్రిని తనిఖీ చేసిన దాఖలాలే లేవు. ఈక్రమంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల వారు దాడి చేసుకుని ఆస్పత్రిలో గందరగోళం సృష్టించారు. ఆస్పత్రిలో మహిళా డ్యూటీ డాక్టర్, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ఇద్దరు మహిళా పీజీ వైద్య విద్యార్థులు, పారిశుధ్య కార్మికురాలు, ఇద్దరు సెక్యూరిటీ యువకులు ఉన్నారు. రౌడీ మూకల దెబ్బకు మహిళా సిబ్బందికి ఏం చేయాలో దిక్కుతోచలేదు. ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఆపే ప్రయత్నం చేసినా వారిపై దాడికి ప్రయత్నించారు. ధర్మరాజస్వామి ఉత్సవాల్లో ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం వరకు పోలీసులు అవిశ్రాంతంగా బందోబస్తు నిర్వహించారు. అయినప్పటికీ ఆస్పత్రిలో గొడవ జరిగిన వెంటనే స్వయంగా డీఎస్పీ స్థాయి అధికారి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. కానీ ఆస్పత్రిలోని ఉన్నతాధికారులు మాత్రం కనీస స్పందన రాలేదు. సూపరింటెండెంట్ మణి, ఇన్‌ఛార్జి ఆర్‌ఎంవో మురళీకృష్ణ తిరుపతిలోని నివా సంలోనే ఉండిపోయారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సూపర్‌వైజింగ్ బాధ్యతలు నిర్వహించే ముగ్గురు హెడ్‌నర్సులు కూడా తిరుపతిలోనే నివాసంలో ఉండిపోయారు. ఇంత జరిగినప్పటికీ ఏ స్థాయి అధికారి కూడా ఆస్పత్రికి చేరుకుని ఆరా తీయలేదు. మామూలుగా అయితే ఆస్పత్రి ఉన్నతాధికారులు సమీపంలోనే నివాసం ఉండాలి. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆస్పత్రికి చేరుకునేలా 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి. సోమవారం ఉదయం 9.30 గంటలకు తీరిగ్గా అందరూ ఆస్పత్రికి చేరుకున్నారు. తమ నిర్లక్ష్య వైఖరిని ఎవరూ ప్రశ్నించకుండా సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన గొడవ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి పోలీసుల వైఫల్యంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయించారు. ఆస్పత్రి ఆవరణలో పోలీసు అవుట్ పోస్టు ఉండి ఉంటే ఇలా జరిగేది కాదంటూ కంటి తుడుపు మాటలను వెళ్లబుచ్చారు. వాస్తవానికి ఇంత బీభత్సం జరిగిన తరువాత వెంటనే ఘటనా స్థలానికి రాకపోయినా ఉదయం విధులకు వచ్చిన వెంటనే సిబ్బందితో వెళ్లి అవుట్ పోస్ట్ కావాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేసి ఉండాలి. కనీసం భద్రతా సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులకు లేఖ సమర్పించాలి. ఇందులో ఏ ఒక్క చర్యను కూడా తీసుకోలేదు. ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కార్గిల్ సెంటర్‌లో ఫ్లెక్సీ సమస్య పరిష్కారం

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): అడ్డదిడ్డంగా ఫ్లెక్సీల ఏర్పాటుతో ప్రమాదకరంగా మారిన కార్గిల్ సెంటర్‌లో సమస్యను శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి పరిష్కరించారు. గత నెల 30న ప్రమాదకరంగా కార్గిల్ సెంటర్ అన్న శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై డీఎస్పీ నరసింహమూర్తి స్పందించారు. ధర్మరాజస్వామి ఉత్సవాలు ముగియడంతో స్వయంగా ఆయన సోమవారం కార్గిల్‌సెంటర్‌కు చేరుకుని సమస్యను పరిష్కరించారు. యూటర్నింగ్‌లో అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. పోలీసు ఐలాండ్ కూడా ఇక్కడి నుంచి తొలగించి స్టేషన్‌కు పంపారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## చిన్నారుల్లో విరేచనాలు ప్రమాదకరం

ఏర్పేడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల్లో మూడురోజులు వరుసగా విరేచనాలైతే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని చెల్లూరులో 104 సర్వీస్ వద్ద తల్లులకు, గ్రామస్తులకు డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. 9వ నెల నుంచి ఐదు సంవత్సరాల వరకు విటమిన్-ఏ మాత్రలు 9 విడతల్లో చిన్నారులకు అందించాలన్నారు. అదే విధంగా రోటా వైరస్ వ్యాక్సిన్ ఇప్పించాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం

ఏర్పేడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడిబాక పంచాయతీ రాజుల కండ్రిగలో కొద్దిరోజులుగా గ్రామస్తులు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఆయన ఎంపీడీవో సౌభాగ్యమ్మతో ఫోన్‌లో మాట్లాడారు. బోరు మోటరు బిగించాలని కోరారు. దీంతో సోమవారం మోటరు ఏర్పాటు చేయడంతో నీటి సమస్య తీరింది. ఎమ్మెల్యేకు, ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.గుండ్రాజు మురళిరాజు, సుబ్రహ్మణ్యంరాజు, ఇంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నక్కల వాగు దాటి మా పిల్లలు వెళ్లలేరు



ఏర్పేడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను తమ గ్రామంలోనే ఉంచాలని ఏర్పేడు మండలం చెన్నంపల్లికి చెందిన మహిళలు సోమవారం తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నంపల్లిలో ప్రభుత్వ పాఠశాలలను పాపానాయుడుపేట పాఠశాలలో విలీనం చేశారన్నారు. తమ గ్రామం నుంచి పాపానాయుడుపేటకు వెళ్లాలంటే మధ్యలో నక్కల వాగును దాటుకుని వెళ్లాల్సి ఉందన్నారు. అంతేకాకుండా సుమారు రెండున్నర కిలోమీటర్లు దూరం ఉందని వాపోయారు. ప్రభుత్వం ఆలోచించి చెన్నపంల్లెలో ప్రభుత్వ పాఠశాల ఉండే విధంగా చూడాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం వారు చెన్నంపల్లి పాఠశాల హెచ్‌ఎం ఉమను కలిసి వినతిపత్రం అందజేశారు.

## సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాళహస్తి పురపాలక సంఘ కమిషనర్‌ను కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. ఈనెల 9న కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. నాలుగు కార్మిక కోడ్లతో పాటు కనీస వేతనం రూ.26వేలు, 8గంటల పని విధానాన్ని కొనసాగించాలని తెలిపారు. ఏఐటీయూసీ నియోజకవర్గకార్యదర్శి టి.మల్లికార్జున్, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారుశీల, ఏఐటీయూసీ నాయకులు మురళి, జనార్దన్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పర్యటించండి

కేవీబీపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాలకు వెళ్లి పర్యటిస్తే వివరాలు తెలుస్తాయని దీంతో అర్జీదారుల సమస్యను పరిష్కరించవచ్చని తహసీల్దారు రోశయ్య చెప్పారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా వచ్చిన అర్జీలను ఆయా వీఆర్వోలకు అప్పగించి క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కువగా ఒకరి భూములు మరొకరు ఆక్రమించడం, పట్టాలు మార్పు చేసుకోవడం తన దృష్టికి వస్తున్నాయన్నారు. అడంగల్ పరిశీలించి వంశపార్యంపరంగా వచ్చే భూములా అనే తెలుసుకుంటే సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. ఆర్ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

## కంటి ఆస్పత్రి మూసివేత బాధాకరం

ఏర్పేడు, జూలై 7(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో మలయాళ స్వామి స్థాపించిన వ్యాసాశ్రమంలో ఆవిర్భావం నుంచి ఏర్పాటు చేసిన కంటి ఆస్పత్రి తదితర సౌకర్యాలను పునరుద్ధరించాలని పూర్వ విద్యార్థులు కోరుతున్నారు. వ్యాసాశ్రమంలో కంటి ఆస్పత్రి ఉన్న సమయంలో ఎంతోమంది పరీక్షలు చేయించుకునే వారని, దాన్ని తొలగించడం బాధాకరమని వాపోయారు. అదే విధంగా ఆశ్రమంలో పలు రకాల జ్ఞానాన్ని పెంచే పుస్తకాలను ముద్రించి ఆశ్రమానికి వచ్చి భక్తులకు అందించే వాటిని కూడా ఆపేయడం బాధాకరమన్నారు. ఆశ్రమంలో ఉన్న పవిత్ర కాశీబుగ్గను దర్శించడానికి కొద్దిరోజులుగా అనుమతిచకపోవడం భావ్యం కాదన్నారు. వీటిని కొనసాగించే విధంగా ఆశ్రమ నిర్వాహకులు, పీఠాధిపతి చర్యలు చేపట్టాలని కోరారు.

## ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ పద్ధతిలో డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. ఈనెల 14వ తేదీ సాయంత్రంలోగా తమ హెవీ డ్రైవింగ్ లైసెన్సు, ఆధార్ కార్డును దరఖాస్తుతో జత చేసి డిపో మేనేజరు కార్యాలయంలో సమ ర్పించాలన్నారు. వివరాలకు నెం.99592 97947, 9063774464లలో సంప్రదించాలని తెలిపారు.

## 11న మెగా జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 11వ తేదీ శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం, ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. మేళాలో 11 బహుళ జాతీయ కంపెనీల్లో 400 పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఈనెల 10వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అన్ని కంపెనీలకు అప్లై చేసు కుని అడ్మిట్‌కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు నెం.7989509540, 8919889609 లలో సంప్రదించాలన్నారు.

## కళాకారులను ఆదుకోండి

### జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతి

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కలంకారీ, కొయ్య బొమ్మల కళాకారులను ఆదుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి కోరారు. ఎమ్మెల్యే సుధీర్‌తో పాటు దశరథాచారి మంత్రిని కలిసి కలంకారీ కుండువాతో సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు. కలంకారీ, కొయ్యబొమ్మలు, లక్కపిడతలు, పూసల జ్యువెలరీ, కాగిత బొమ్మల తయారీకి చేయూత ఇవ్వాలని కోరారు.

## సమస్యలను పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. భూ సమ స్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఎంపీడీవో వెంకట రత్నమ్మ, ఏవో షణ్ముగం, ఏపీఎం మునెయ్య, ఏఈ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంకుల శుభ్రం తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండలంలోని వెస్ట్‌వరత్తూరులో ఓవర్ హెడ్ ట్యాంకును సోమవారం పరిశీలించారు. కలుషిత నీరు తాగితే టైఫాయిడ్ బారినపడే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఏపీఎం మునెయ్య, ఏపీవో దేవరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రప్రదేశ్): పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పెండ్లిమండపం వద్ద అన్నదానం చేశారు. ఇర్ల రాజా, ఎం.వెంకటసుబ్బయ్య, ఎం.ఈశ్వర్, వెంకటముని పాల్గొన్నారు.

**నాగలాపురం (ఆంధ్రజ్యోతి):** మండ లంలోని టీపీకోట అరుంధతివాడలో మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. మస్తాన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.